ఆదివారం

ప్రజాశక్తి

7 అక్టోబర్, 2001

పురుగుల్లా రాలిపోతున్న రైతులు

పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం

ఎ. మల్లారెడ్డి

ఎస్.ఇ. పిఆర్ సర్కిల్, ఆదిలాబాద్

ఆదిలాబాద్ జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ శాఖచే 2001-2002 ఆర్థిక సం॥లో వివిధ పథకాల క్రింద చేపట్టబడిన అభివృద్ధి పనుల నోట్

1. RIDF-III (నాబార్డ్) : రు. 575.20 లక్షల అంచనా వ్యయంతో పది (10) గ్రామీణ రోడ్లు / బ్రిడ్జిల పనులు చేపట్టబడ్డాయి. జిల్లాకు కేటాయించబడిన రు. 573.70 లక్షల్లో రు. 506.67 లక్షలు ఈ పనుల నిమిత్తం జారీ చేయబడ్డాయి. తొమ్మిది పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన ఒక పని ఎర్రవాగుపై బ్రిడ్జి నిర్మాణంలో ఉంది.

2. RIDF-VI (నాబార్డ్) : రు. 323.80 లక్షల అంచనా వ్యయంతో అయిదు (05) గ్రామీణ రోడ్ల నిర్మాణం చేపట్టబడింది. మొత్తం పనులు (05) జరుగుతున్నాయి. జిల్లాకు కేటాయించబడిన 60.00 లక్షల్లో రు. 29.85 లక్షలు ఈ పనులకు ఖర్చు చేయబడ్డాయి.

3. RIDF-VII (నాబార్డ్) : రు. 331.00 లక్షల అంచనా వ్యయంతో నాలుగు (04) గ్రామీణ రోడ్ల నిర్మాణం చేపట్టబడింది. రెండు పనులకు ది: 23-08-2001 న టెండర్లు స్వీకరించబడతాయి. మిగిలిన రెండు పనుల అగ్రిమెంట్లు పూర్తి అయ్యాయి.

4. APHM & ECRP (WBAP): (A) రోడ్లు : రు. 183.00 లక్షల అంచనా వ్యయంతో అయిదు (5) రోడ్ల నిర్మాణం చేపట్టబడింది. మొత్తం చేయబడిన ఖర్చు రు. 173.29 లక్షలు. అన్ని పనులు పూర్తి చేయబడ్డాయి.

(బి) బ్రిడ్జిలు : రు. 325.64 లక్షల అంచనా వ్యయంతో ఆరు (6) బ్రిడ్జిల నిర్మాణం చేపట్టబడింది. జిల్లాకు రు. 108.00 లక్షలు కేటాయించబడగా రు. 102.27 లక్షల ఖర్చుతో పనులు పూర్తి చేయబడ్డాయి.

5. APERP (WBP) ఫేస్-I : రు. 1271.64 లక్షల అంచనా వ్యయంతో ముప్పై నాలుగు (34) రోడ్ల నిర్మాణం చేపట్టబడింది. జిల్లాకు రు. 1271. 64 లక్షలు కేటాయించబడగా రు. 1199.34 లక్షల ఖర్చుతో అన్ని పనులు పూర్తి చేయబడ్డాయి.

6. APERP (WBP) ఫేస్-II : రు. 1740.00 లక్షల అంచనా వ్యయంతో (25) రోడ్ల నిర్మాణ: చేపట్టబడింది. (10) పనులు ఇప్పటికి పూర్తి అయ్యాయి. మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. మొత్తం ఖర్చు రు. 1237.06 లక్షలు అవుతుంది.

7. APERP (WBP) ఫేస్-III : రు. 2200.00 లక్షల అంచనా వ్యయంతో (47) బ్రిడ్జిల నిర్మాణం చేపట్టబడింది. (45) పనులు నిర్మాణంలో ఉండగా ఒక పని పూర్తి అయింది. మరొక బ్రిడ్జి పనుల బిడ్‌లు నిర్ణయించాల్సి ఉంది. మొత్తం ఖర్చు రు. 383.76 లక్షలు అవుతుంది.

8. APERP (WBP) ఫేస్-IV : రు. 4207.39 లక్షల అంచనా వ్యయంతో (55) రోడ్ల నిర్మాణం చేపట్టబడింది. (48) పనులు వివిధ స్థాయిలలో జరుగుతున్నాయి. (7) రోడ్ల పనులు బిడ్‌లు నిర్ణయించాల్సి ఉంది. మొత్తం ఖర్చు రు. 164.14 లక్షలు అవుతుంది.

శుభాకాంక్షలతో...

మిల్కోమా డెయిరీ

డెయిరీ : ఏపూరు,
హనుమాన్‌జంక్షన్, కృష్ణాజిల్లా.
ఫోన్స్ : (08656) 42278, 42979

గత ఐదు సంవత్సరములుగా కృష్ణా
పశ్చిమగోదావరిజిల్లాలలో పాల
ఉత్పత్తిదారుల శ్రేయస్సే ధ్యేయంగా
నాణ్యతకు మరోపేరుగా వినియోగదారుల
ప్రశంసలనందుకున్న

"మిల్కోమా డెయిరీ"

మిల్కోమా ఉత్పత్తులు : పాలు, నెయ్యి, ఫ్లావర్డ్ మిల్క్

పొదుపు

ఆదాయం వ్యయం లెక్కల్ని మనం చిన్నప్పుడే నేర్చుకున్నాం. అవి కేవలం లెక్కలు మాత్రమే అనుకుని కొట్టి పారేస్తే కొంపమునుగుతుంది. ఆదాయం వృద్ధి చేసుకునేందుకు ఆమోదకరమైన మార్గాలు ఎప్పటికప్పుడు అన్వేషించాలి. ఖర్చు తగ్గించుకునే పద్ధతుల్ని అమలు చేయాలి. ఆదాయం మాట మరిచిపోయి విచ్చలవిడిగా ఖర్చు పెడితే ఖచ్చితంగా దెబ్బతింటాం. ఖర్చు చేసేప్పుడు చేతికో కళ్లెముండాలి. వెనకాముందు ఆలోచించాలి. సదరు ఖర్చు అత్యవసరమనుకున్నప్పుడు - ఫర్లేదు - నిశ్చింతగా ఖర్చు పెట్టచ్చు. చాలకపోతే అప్పు చేసినా తప్పు లేదు!

మనతో మాట

కడుపు మాడ్చుకుని కూడబెట్టమని ఎవరూ చెప్పరు. కోటి విద్యలు కూటి కొరకే అన్నారు. అన్నం తినకుండా ఆదా చేయడం ప్రారంభిస్తే అసలుకే మోసం జరుగుతుంది. ఆరోగ్యం చెడిపోతుంది. ప్రాణం పోయినా పోవచ్చు. ప్రాణం కంటె మించిన దినుసు మరొకటి లేదు. ప్రాణావసరాలకు ఎంత ఖర్చు చేసినా సబబుగానే వుంటుంది. సరదాలూ, షికార్లూ బీడీలూ, సిగరెట్లూ - ఇవన్నీ ఆఫ్టరాల్ అవసరాలు. అదుపులో పెట్టుకున్నా, స్వస్తి పలికినా ప్రాణం పోదు ! ఆదాయం కంటే ఖర్చు తక్కువగా వున్నప్పుడు సుఖపడతాం. ఆ ఖర్చు ఎంత తక్కువగా వుంటే అంత ఎక్కువ సుఖం దొరుకుతుంది!

దీనివల్ల ఎంతో కొంత వెనకేసుకుంటాం. అయిదులు పదులవుతాయి. పదులు వందలూ వేలవుతాయి. వర్షపు చినుకు చిన్నదే! ఆ చినుకులే కాలవలవుతాయి. మనం దాచుకున్న డబ్బు ఆపదల్లో ఆదుకుంటుంది. చింతలేని బ్రతుక్కి చిరునామా అవుతుంది. ఆదాయాన్ని మరిచిపోయి ఆడంబరాలకు అలవాటు పడితే అప్పుల పాలవుతాం. అప్పులిచ్చిన వాళ్లంతా దానం చేసేమని అనుకోరు. ఏదో ఒక రోజు మా అప్పు మాటేమిటని చొక్కా పట్టుకుని అడుగుతారు. నీళ్లు నమిలితే జాలి పడరు. ఇంట్లో వున్న మంచాలూ, కంచాలు వీధిలోకి వస్తాయి. ఆడంబరంగా బతికిన లెక్కకి అనువైన ఆన్సరిదేనని లోకానికి చెబుతారు!

ఈ సందర్భంగా పొదుపు అనే పదం గురించి కొంత ముచ్చటించుకోవాలి. పొదుపుని ఒక ఉద్యమంగా స్వీకరించమని ప్రభుత్వం వారు చెబుతుంటారు. మంచిమాటే! ఈ పేరుతో పిసినిగొట్టుతనాన్ని పెంచుకుంటే నవ్వుల పాలవుతాం. ఒక సినిమాలో ఇదే చెప్పేరు. రాత్రిళ్లు పాత పేపర్లను నైట్ డ్రెస్సగా వాడుకోడం... రాళ్లు కొట్టి నిప్పు చేసి వంట ప్రారంభించడం... కోడిని చూస్తూ కంచం కెలుకుతూ కోడికూరతో భోం చేస్తున్న ఫీలింగుతో తృప్తి పడటం లాంటి పిచ్చి పనులను పొదుపని పిలవరు. పిసినారితనమంటారు. ఏతావాతా ఆడంబరాలకు ఆహుతి కావడం కన్నా - పిసినిగొట్టుగా బతకడమే బెటరు! ☆

లోపలి పేజీల్లో.....



'సిగ్గుపడిన పులి' ...11



బీమాతోనే క్రీడాకారులకు భద్రత ...17

తగ్గింపు ధరలు ...15

మిస్సింగ్ యూ ...18, 19

ఇంకా...

ఆరోగ్యం 6, 7

బాల వికాసం 10

బాల నేస్తాలు 12, 13

టూరిస్ట్ గైడ్ 16

పుస్తకపరిచయం 20

జీవనశైలి 21

రియల్ స్టోరీ 22, 23

పలుకుబడి 24

వగైరా........

పురుగుల్లా రాలిపోతున్న రైతులు

రైతుల కష్టాలకు అంతం అనేదే కనిపించడం లేదు. ప్రతికూల వాతావరణంలో అప్పో సప్పో చేసి అష్టకష్టాలు పడి పంటలు పండిస్తే ఆ పంటను కొనే నాథుడే లేక దివాళా తీసి వందల సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల సంగతి మనకు తెలుసు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో ఆరంభమయినాయన్న ఆనందం రైతుకు ఎంతో కాలం నిలవ లేదు. తర్వాత తీవ్ర వర్షాభావం నెలకొనడంతో మాగాణి పంటలపై రైతు ఆశలొదుకున్నాడు. అక్కడక్కడా వేసిన మెట్ట పంటలు సైతం అంతంత మాత్రంగానే ఉన్నాయి. పత్తి, మిర్చిలాంటి వాణిజ్య పంటలపైనే ఆశలు పెట్టుకున్నాడు. కాని పత్తికి సెనగపచ్చ పురుగు విపరీతంగా సోకడంతో దిక్కుతెలియని పరిస్థితిలో పడిపోయాడు. అందిన కాడికి అప్పులు తెచ్చి, ఎంత ధరయినా తెగించి పురుగు మందులు విపరీతంగా కొడుతున్నాడు. ఈ పురుగు మందుల ధాటికి పురుగులు చావడం మాట అలా వుంచి వాటిని కొడుతున్న రైతులే ఆ విష ప్రభావానికి ప్రాణాలు వదులుతున్నారు. వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలలో పురుగు మందుల ప్రభావానికి అనేక మంది మరణించారు. వందల సంఖ్యలో ఆసుపత్రుల పాలయ్యారు. రాష్ట్రంలో ఈ ఏడాది 24 లక్షల ఎకరాల్లో పత్తి వేశారు. ప్రధానంగా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోనే 13 లక్షల ఎకరాల్లో వేశారు. ఒక విధంగా గతంకంటే ఈ విస్తీర్ణం ఎక్కువ. ఒక వైపున ప్రభుత్వం పత్తి రైతులు వినియోగించే క్రిమిసంహారక మందులు కల్తీతో కూడినవనీ, సమయం సందర్భం లేకుండా పైరిథ్రాయిడ్ మందులు వాడుతున్నారని ప్రకటిస్తూనే వాటి అదుపుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 1998లో లక్షలాది ఎకరాలకు పేనుబంక, పచ్చపురుగు తగిలి పెద్దఎత్తున నష్టం జరిగినప్పుడు రైతులు విచక్షణారహితంగా మందులు వాడటం వల్లే ఆ పురుగు నాశనం కావడం లేదని నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు తేల్చారు. పత్తికి ప్రత్యామ్నాయం వేయాలని కూడా వారు సూచించారు. కాని ఈ విషయాన్ని రైతులకు సరైన పద్ధతిలో తెలియచేయకపోవడం, రైతులకు మరో ఆదాయ వనరు లేకపోవడం వలన తమ భూముల్లో పత్తి పండించడానికే వారు ఉత్సాహం చూపారు. నాలుగైదేళ్ళుగా పత్తిపై నష్టపోతున్నా సరే మళ్ళీ అదే పంటను రైతులు పండించాలని నిర్ణయించుకోవడం గమనించదగ్గ విషయం.

వరంగల్ జిల్లాలో సాధారణ విస్తీర్ణం 3.25 లక్షలు కాగా 4.30 లక్షల ఎకరాల్లో పత్తి వేశారు. ప్రాథమిక దశలో (సెప్టెంబర్ 15 వరకు) పైరిథ్రాయిడ్ మందుల వాడకాన్ని నిషేధించి ప్రభుత్వం మంచిపని చేసింది. అయితే వేసిన పంటల పరిస్థితి, శనగపచ్చ పురుగు సోకిన విషయాన్ని గుర్తించడంలో ప్రభుత్వం విఫలమవడంతో లక్షలాది ఎకరాలకు ఈ పురుగు సోకింది. ఇది గమనించిన రైతులు తొలికాపు నష్టపోతామని భావించి విచక్షణారహితంగా మందులు చల్లారు. ఏ మందులు వాడాలన్న విషయం వ్యవసాయ శాఖ అధికారులు కాకుండా పురుగుమందుల డీలర్లే సూచించారు. ఆ విధంగా మోతాదుతో సంబంధం లేకుండా తమ దుకాణాల్లో ఉన్న స్టాకు ఖాళీ అయ్యేందుకు విపరీతంగా మందులు కొనేలా రైతులను ప్రోత్సహించారు.

గత మూడేళ్లుగా పత్తి పంట రైతుల పాలిటి మృత్యుపంటగా మారుతుండగా, వరంగల్ జిల్లాలో ఈ ఏడాది లక్ష ఎకరాలకు పైగా పత్తి సాగవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. గత సంవత్సరం ఎక్సెల్ రకం పత్తి విత్తనాలురైతులను నట్టేట ముంచగా, అంతకుముందు సంవత్సరం ధరల్లేక రైతులు విలవిల్లాడారు. రాష్ట్రంలోనే వరంగల్ జిల్లా పత్తిపంట సాగులో అగ్రస్థానంలో నిలిచింది. దీంతో బహుళజాతి కంపెనీలు జిల్లా రైతాంగంపై దృష్టిపెట్టి తమ పురుగుమందులను పటిష్టమైన మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పురుగులను చంపడానికి ఒకరిని మించి మరొకరు పోటీ పడ్డారు. సింథెటిక్ పైరిథ్రాయిడ్స్ మందులను సైతం పిచికారి చేశారు. రైతులు అడిగితే వేము అమ్మామని దుకాణదారులు సమాధానం చెప్తున్నారు. సింథెటిక్ పురుగు మందులను దొంగచాటుగా డీలర్లు విక్రయిస్తున్నారని 15వ తేదీన జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖాధికారులు షాపులపై జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. పది షాపులలో నకిలీ మందులుకు సంబంధించిన 80 శాంపిల్స్‌ను పట్టుకొని పరీక్షలకు పంపారు. దాన్ని జీర్ణించుకోలేని కొందరు డీలర్లు అదేరోజు రాత్రి 9 గంటలకు ఓ దుకాణంలో వరంగల్ వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వెంకట్‌రెడ్డిని నిర్బంధించారు. ఉన్నతాధికారులు స్పందించి సింథటిక్ పైరిథ్రాయిడ్స్‌పై నిషేదాన్ని ఎత్తివేశాక ఆయనను విడిచిపెట్టారు. ఈ ఉదంతంతో వ్యాపారులు రైతులను పావుగా వాడుకున్నారు. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది 10 వేల భూసార పరీక్షలను నిర్వహించారు. ఈ నివేదికలో పాస్పరస్ అధికంగా వున్నట్లు వ్యవసాయ శాఖాధికారులు గుర్తించి, డిఎపిని తక్కువగా వాడాలని రైతాంగానికి సూచించారు తప్ప విస్తృత ప్రచారం చేపట్టలేదు. ఇదేదీ తెలియని రైతాంగం మామూలుగా వేసే విధంగానే డిఎపిని 40 రోజులు దాటిన పత్తి మొక్కలకు సైతం ఎరువుగా వేశారు. దీంతో పత్తి చేను మీటరున్నర ఎత్తువరకు పెరిగింది. వాస్తవానికి కాంప్లెక్స్ ఎరువైన డిఎపి (అమ్మోనియం పాస్ఫేట్)ను దుక్కిలో వేయాలి. ఇదిలావుండగా ఏపుగా పెరిగిన పత్తి చేనులో దోమ, ఎఫిడ్స్ పెరగడం ప్రారంభించాయి. అలాగే సాధారణంగా పత్తి పంటను చలికాలం ప్రారంభమయ్యే వరకు నష్టపరిచే శనగపచ్చ పురుగు ఉధృతి క్రమేపి పెరిగింది. వ్యవసాయాధికారులు అందుబాటులో వుండకపోవడంతో రైతులకు పురుగుమందులు అమ్మే డీలర్లే వ్యవసాయాధి కారులయ్యారు. ఫలితంగా విచ్చలవిడిగా మందులను వాడారు. కాగా పత్తి చేను ఎత్తుగా పెరగకుండా వుండడానికిగాను తల చంచులను కత్తిరించాలని (నిప్పింగ్), ఇపుడు వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. బాగా పెరిగిన మొక్కలపై పిచికారి చేయడం కష్టంగా మారినప్పటికీ ఓర్చుకొని రైతులు పిచికారి చేస్తున్నారు. హన్మకొండలోని సింగారం,

అన్ని విషాలకు ఒకే ట్రీట్‌మెంట్!

వరంగల్‌లోని మహాత్మాగాంధి స్మారక వైద్యశాల (ఎంజిఎం)లో చికిత్సకై చేరుతున్న రైతుల ప్రాణాలు గాలిలో దీపాలుగా మారిపోయాయి. ఏ పురుగుమందుకు ఏ మందు విరుగుడనేది ఆస్పత్రి డాక్టర్లకు తెలియకపోవడంతో వారు ఒకేరకమైన చికిత్సనందిస్తున్నారు. దీంతో అస్వస్థతకు గురైన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. క్లోరిపైరిపాస్, క్వినాల్‌పాస్, మోనోక్రోటోపాస్, మిథైల్, పారాథియాన్, ప్రొఫెనోఫాస్, డైమిథోయేట్, మిథైల్‌డెమిటీన్ వంటి పురుగుమందులకు అట్రాపిన్ సల్ఫేట్ (ఐవి లేక ఐఎం) 2 - 4 మి.లీ. గ్రామ్‌లు లేక పిఎమ్‌ను విరుగుడు మందులుగా చికిత్సలో వాడాలి. కార్బరిల్, కార్బోఫ్యూరాన్ గుళికలకు సైతం ఇవే మందులను వాడాల్సి వుంది. సైపర్‌మిథిన్, ఆల్ఫామైత్రిన్, ఫెన్‌వాల్‌రేట్, డెల్టామెథ్రీన్, లిండేన్, డైకోపాల్ వంటి సింథటిక్ పైరిథ్రాయిడ్ పురుగుమందులకు విరుగుడుగా ఫినోబార్బిటాల్‌ను చికిత్సలో ఉపయోగించాలి. ఇక ఎండోసల్ఫాన్‌కు విరుగుడుగా మెటాక్లోప్రామైడ్‌ను 10 మి.గ్రా. చొప్పున వాడాలి. ఎంజిఎంలో మరణించిన వారిలో అధికులు ఎకలక్స్ మందు ప్రభావంతో మృతి చెందగా, నలుగురు ఎండోసల్ఫాన్ పిచికారి చేసి చికిత్సకై ఎంజిఎంలో చేరారు. వీరికి మోటాక్లోప్రామైడ్‌ను విరుగుడు మందుగా వాడాల్సి వుండగా, అట్రాపిన్, పిఎమ్‌లను వాడడం విస్మయాన్ని కలిగిస్తోంది. కాకతీయ మెడికల్ కళాశాలలో టీచింగ్ ప్రొపెసర్లుగా పనిచేస్తున్న డాక్టర్లకే విరుగుడుమందుల గూర్చి అవగాహన లేకపోతే మండల, గ్రామాల్లో పనిచేసే వైద్యుల చికిత్స ఎలా వుంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో పురుగులమందు తాగి ఎంజిఎంలో చికిత్సకై చేరుతున్న వారి ప్రాణాలు గాల్లో కలిసిపోవడానికి డాక్టర్లే కారణమవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యాధికారులకు పురుగుల మందుల గూర్చి అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

మనుషుల ప్రాణాలకు, పర్యావరణానికి హాని కల్గించే

విచక్షణారహిత పురుగుమందుల వినియోగం

ప్రొఫెసర్ వేణుగోపాలరావు
వ్యవసాయకళాశాల తిరుపతి.

ఐరోపా ఖండంలో పారిశ్రామిక విప్లవమనేది మానవ నాగరికతలో ఒక మూలమలుపైతే, రసాయనాల ద్వారా పురుగుల్ని, బెడద జీవుల్ని నాశనం చెయ్యాలని ఆలోచన, ఆచరణ మరో ముఖ్య పరిణామంగా భావించవచ్చు. ప్రారంభంలో అరుదుగా వాడబడిన గంధకం, ఆర్సెనికల్ మిశ్రమాలు, పారిస్‌గ్రీన్, జింక్ పాస్ఫేడ్, ఫ్లోరిన్ మిశ్రమాల స్థానంలో బోర్డో మిశ్రమం, పార్శల్ డిహైడ్, మెర్క్యురి మిశ్రమాలు, సున్నం-గంధక మిశ్రమాలు ప్రవేశపెట్టబడటం ఒక దశగా పేర్కొనవచ్చు. అయితే ఎప్పుడో కనిపెట్టబడి మరుగున పడిపోయిన డిడిటి (డైక్లోరో డైఫినైల్ ట్రైక్లోరి ఈథైన్) అనే రసాయనం పురుగులపై ముఖ్యఆయుధంగా ముందుకు తేబడటం ఒక కీలకదిశగా ఈనాడు అందరూ అంగీకరిస్తున్నారు. ఈ రసాయనం యొక్క అనుయాయులైన అనేక కృత్రిమ రసాయనాల వెల్లువ ఈ శతాబ్ద రెండవభాగంలో ఉరవడిగా సాగింది. దాని ఫలితంగానే మనం వ్యవసాయంలో పురుగుల్ని ఎదుర్కొనే ముఖ్యవనరులుగా వీటిని వాడుతున్నాం. ఈ కృత్రిమ రసాయనాలను మనం ఆర్గనోక్లోరిన్, ఆర్గనోఫాస్ఫేట్, కార్బమేట్‌లుగా గుర్తించవచ్చు. ఇదే ఒరవడిలో సహజసిద్ధంగా చేమంతి (క్రైసాంతిమమ్) జాతి మొక్కల నుండి లభించే 'పైరత్రిన్' వంటి విషాన్ని అనుసరిస్తూ అభివృద్ధిపరచబడిన కృత్రిమ పైరత్రాయిడ్‌లను కూడా ముందుకు తేవడం జరిగింది. తర్వాత దశలో సముద్రజీవుల నుండి భూమిలోని బూజుల్నుండి, బ్యాక్టీరియాల నుండి వెలువడే విషాల లక్షణాల్ని విశ్లేషించి రసాయన శాస్త్ర వెలుగులో కొత్త రకాలైన 'నెరెస్ టాక్సిన్'లు, 'ఎవర్‌మెక్టిన్స్', 'తురిసైడ్స్' వంటివి రూపొందించడం జరిగింది.

సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయంలో గత 10-15 సంవత్సరాల్లో అధిక సంచలనం సృష్టించిన ఈ తరగతి పురుగుమందుల గురించి కొంత విపులంగా చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

19వ శతాబ్దంలోనే పురుగుమందు లక్షణాల్ని గుర్తించబడిన వృక్షసంబంధమైన రసాయనాల్లో ఈ పైరెత్రిన్‌ను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. దీని ప్రాముఖ్యతను, ప్రత్యేక లక్షణాల్ని తూర్పు యూరప్ దేశాల వాళ్ళు ముందు తెచ్చినప్పటికీ దీని ఉత్పత్తి జపాన్, కెన్యా, ఉగాండా, ర్వాండా, ఆస్ట్రేలియా దేశాల్లో జరిగింది. ఈ వృక్ష రసాయనంలో ఉండే ఆరు మూలకాల మిశ్రమం ద్వారా వచ్చే పురుగుమందు విషం-పైరెత్రిక్ ఆమ్లం ప్రముఖంగా నిలబడింది. ఈ సహజ రసాయనంలో ఉండే తాత్కాలిక ప్రభావిత లక్షణం (వెలుతురికి, వేడికి నిలబడలేని స్థితి) వలన పైర్లపై వచ్చే పురుగులపై వాడబడే ప్రాచుర్యం పొందలేదు.

అయితే 1950-70 ప్రాంతాల్లో జరుపబడిన పరిశోధనాల్లో ఈ సహజ పైరిత్రాన్‌లో వుండే అననుకూల లక్షణాల్ని పోగొడుతూ, పైర్ల వాతావరణంలో నిలబడగలిగిన కృత్రిమ పైరెత్రాయిడ్‌లు వెలువడ్డాయి. మొదటిగా అల్లెత్రిన్ అనే పైరెత్రాయిడ్ వెలువింది. దాన్ని మనం మొదటితరం కృత్రిమ పైరత్రాయిడ్‌గా భావిస్తే డైమెత్రిన్, రెస్‌మెత్రిన్, బయో ఎల్లెత్రిన్, టెట్రామెత్రిన్ వంటివి రెండవతరం కృత్రిమ పైరత్రాయిడ్ మందులు. వీటిలో వుండే లోపాలవల్ల ఇవి ప్రారంభంలోనే విసర్జించబడ్డాయి. అయితే 'అల్లెత్రిన్' దోమలపై పనిచేసే మందుగా నేటికీ వివిధ రకాలుగా ఇళ్ళలో వాడబడుతూనే వుంది.

డెబ్బయ్యవ దశకంలో మనం ఈనాడు విచ్చలవిడిగా వాడే స్థితికి తేబడిన మూడవతరం పైరెత్రాయిడ్స్ వచ్చాయి. వీటిల్లో ఫెన్‌ప్రొపెత్రిన్, పెర్మెత్రిన్, సైపర్ మెత్రిన్, డెల్టామెత్రిన్, ఫెన్ వెలరేట్ వంటివి ముఖ్యమైనవిగా భావించవచ్చు. దీని తర్వాతి దశలో (నాల్గవతరం) వచ్చిన ఫ్లూసైత్రినేట్, ఫ్లూవాలినేట్, సెఫ్లూత్రిన్, సైక్లోప్రొత్రిన్, ఫెన్‌పైత్రిన్, సైహలోత్రిన్ వంటివి వచ్చాయి. ఈ మధ్యకాలంలో యిథోఫెన్ ప్రాక్స్ వంటి క్రొత్త పైరత్రాయిడ్ మందు ప్రవేశపెట్టబడింది.

వెలుతురికి, వేడికి విరిగిపోకుండా వైవిధ్యమైన వాతావరణాల్లో పలురకాలైన బెడద పురుగులపై ప్రభావాన్ని చూపించగలిగిన ఈ విష రసాయనాలు అతివేగంగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇవికూడా పురుగుల నాడీమండలంపైనే పనిచేసి పురుగుల్ని మరియు ఇతర జంతువుల్ని నిర్వీర్యం చేసి హతమారుస్తాయి. వీటిలో చొప్పించబడిన క్లోరిన్, బ్రోమిన్ మూలకాల వలన వీటి విషప్రభావం అధికం చేయబడుటమేకాకుండా, వీటిశక్తి ఎక్కువసేపు నిలబడగలుగుతుంది. పురుగులపై ఈ మందుల విషలక్షణాలు ఆర్గనోక్లోరిన్ మందు లక్షణాలకి దగ్గరగా వుంటాయి. కాని ఇవి అతితక్కువ మోతాదులోనే తమ శక్తిని వ్యక్తపరచగలవు. డిడిటి వంటి రసాయనాల వలనే ఇవి కూడా కొవ్వు నిల్వవుండే శరీరభాగాల్లోకి చేరిపోతాయి.

బాసిల్లస్ జన్యు మార్పిడి ద్వారా సస్యరక్షణ

ఈ మధ్యకాలంలో అధిక సంచలనం సృష్టించి ముఖ్య వ్యవసాయ వ్యాపార వస్తువుగా మార్చబడిన ఈ బిటిజీన్‌ను గురించి కూడా తెలసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. భూమిలో ఎక్కువగా దొరికే బ్యాక్టీరియాగా బాసిల్లస్ తురిన్‌జియన్సెస్‌ను గుర్తించాలి. వీటిల్లో ముఖ్యంగా కుటాస్కీ లనే స్ట్రెయిన్ ఎండోటాక్సిన్ విషాన్ని వెదజల్లి పురుగు శరీరాన్ని ఆక్రమించుకొనే స్థాయిలోకి పెరగగలదని గమనించబడింది. తద్వారా పురుగుజబ్బున పడి నశించిపోతుంది. ఈ తరహా జబ్బు క్రిములు పొలుసురెక్క మరియు పెంకురెక్క జాతి పురుగులపై మాత్రమే పనిచేయగలవు. వీటి ప్రభావం రసంపీల్చే పురుగులపై ఏమాత్రం వుండదు.

అయితే ఆధునిక పరిజ్ఞాన నేపథ్యంలో మనకు కావాల్సిన మొక్క కణాల్లోకి ఈ బాసిల్లస్ బ్యాక్టీరియా జన్యువును ఎజెటోబాక్టర్ అనే మరో వాహక బ్యాక్టీరియా ద్వారా చొప్పించే వీలు కలిగింది. ఆ విధంగా మార్పు చేయబడిన (బిటిజీన్ చొప్పించబడిన) మొక్కల నుండి వచ్చే విత్తనాల్లో కూడా ఈ బిటి జన్యువు నిలబడిపోతుంది. తద్వారా అటువంటి పంటరకంపై వచ్చిన పురుగు బిటి జబ్బుబారిన పడి నశించిపోతుంది.

ఈ బిటి జన్యువు చొప్పించబడిన మొక్కల వలన వాటిని ఆశించే కొన్ని రకాల పురుగులు సహజంగా అదుపు చేయబడతాయనేది నిజమైనప్పటికీ అది తాత్కాలికంగా మాత్రమే నిలబడగలదని, పురుగుల్లో ఉద్భవించే వ్యాధి నిరోధక శక్తి వలన ఈ విషం పనికి రాకుండా పోతుందనేది వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే గ్రహించారనేందుకు అనేక దాఖలాలున్నాయి. అంతేగాక ఒక తరహా పురుగులు సోకని మొక్కలపై వేరొక తరహా పురుగులు అతివేగంగా పెరగటం ప్రకృతి సహజంగా జరిగే ప్రక్రియగా గమనించాలి. ముఖ్యంగా ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని కేంద్రీకరించి వాడబడే మన ముఖ్యవాణిజ్య పైరైన పత్తిపై వివిధ దశల్లో వివిధ రకాలైన పురుగులు/మైట్స్ రావటం సహజమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

వృక్షసంబంధ మందులే శ్రేష్టం

వేప, గానుగ, సీతాఫలం వంటి వృక్షాల నుండి వచ్చే రసాయనాలు కూడా పురుగుమందులుగా వాడవచ్చనే విషయాన్ని ఎప్పుడో గుర్తించినప్పటికీ, తాజాగా రసాయన శాస్త్రవేత్తలు, వ్యాపారవర్గాలు వీటి మూల రసాయనాల కోసమై ప్రయత్నం చేశారు. దాని ఫలితమే వేప నుండి ఎజార డెక్టిన్, గానుగ నుండి 'పొంగా మిన్', సీతాఫలం నుండి ఎనోనిన్ అనే రసాయనాలు. ఇవి పురుగుమందులుగా వాడదగినవేనని నిర్ధారించబడ్డాయి. అయితే వీటిల్లో ఎజార్ డెక్టిన్ అనే మందు ప్రస్తుతం విస్తృతంగా వాడబడుతుంది. ఈ పురుగుమందు పురుగుల్ని తాత్కాలికంగా పైరునుండి దూరంగా మరల్చి వేయడమే గాకుండా గ్రుడ్లు పగలకుండా చేయడం, పురుగుదశల్ని పెరుగుదలకు దూరం చేయటం జరుగుతుందని గమనించబడింది. అయితే దీనిలో వుండే ఇతర బలహీనతల వలన ఇది అంతగా ప్రాచుర్యం పొందలేదు. కాని పర్యావరణ వినాశనాన్ని వేగిరపరిచే అనేక కృత్రిమ రసాయనాల కంటే ఇది మెరుగైనదనేది వాస్తవం. వేపలో వుండే ఇతర అనుకూల లక్షణాల వలన ఇది ఏళ్ళతరబడి భారతదేశం వంటి పురాతన వ్యవసాయక దేశాల్లో ముఖ్య వ్యవసాయక వనరుగా అనేక రూపాల్లో వాడబడుతూనే వున్నది. అయితే వ్యాపారవర్గాలు వీటిని పూర్తిగా పనికిరాని మందులుగా రైతులచే అనిపిస్తున్నారు.

సారంపల్లి మల్లారెడ్డి,
కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి

తెగులు బారిన పడిన పత్తి పంటతో ఆందోళన చెందుతున్న రైతుకు లాభాపేక్షతో మోతాదుతో నిమిత్తం లేకుండా వ్యాపారులు మందులను అంటగట్టడంతో మందుల వాడకంపై సరైన అవగాహన లేని రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకుండానే మందులను చల్లారు. వర్షాభావం వల్ల వాతావరణంలో వచ్చిన మార్పులతో పాటు తగు రక్షణ చర్యలు తీసుకోకపోవడం వలన వరంగల్ జిల్లాలో 11 మంది చనిపోయారు. వివిధ ఆసుపత్రుల్లో 250 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరి పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈ పరిస్థితి అంతా సెప్టెంబర్ రెండవ వారం తరువాత తలెత్తిందే. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం వెంటనే స్పందించి ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ శాఖ కమిషనర్, ఎన్‌జిరంగా యూనివర్శిటీ వైస్ చాన్సలర్‌లకు మెమోరాండాల ద్వారా తెలియచేశాం. ఆ తరువాత ప్రభుత్వం విచారణ చేపట్టింది. అయితే వరంగల్ జిల్లా కలెక్టర్ మాత్రం 4 నెలల్లో ఐదుగురు మాత్రమే చనిపోయారని పత్రికలకు ప్రకటించారు. దీన్ని బట్టి ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నదన్న విషయం అర్థమవుతోంది. ఈ సమస్యపై ప్రభుత్వం ప్రతిష్టకు పోతున్నది తప్ప బాధితులను ఆదుకొనే దిశగా చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యంగా వ్యాపార పంటల మీద క్రిమి సంహారక మందుల వాడకం తగ్గించే చర్యలు చేపట్టాలని ఐదేళ్ళుగా ఆందోళనల ద్వారా కోరుతున్నాం. ఈ విషయంలో రైతులకు తగు అవగాహన కలిగించేందుకు సదస్సులు నిర్వహించడంతో పాటు కరపత్రాలు ప్రచురించాలని కోరాం. అంతేకాక డీలర్లపై నియంత్రణ విధించాలని కూడా డిమాండ్ చేశాం. అయితే ప్రభుత్వం మాత్రం చట్టంలో లొసుగులు ఉన్నాయని అంగీకరిస్తూనే చట్ట సవరణ చేయకుండా వ్యాపారులను కాపాడే ప్రయత్నం చేస్తోంది. పేరుకు కొన్ని పెరిత్రాయిడ్ మందులపై నిషేధం విధించినా అమ్మకాలు మాత్రం సాగుతూనే ఉన్నాయి.

వ్యవసాయరంగం నుండి ముఖ్యంగా పత్తిపంట నుండి ప్రభుత్వానికి 84 కోట్ల రూపాయలు, (మార్కెట్ ద్వారా) పత్తిగింజల అమ్మకం ద్వారా 14 కోట్ల ఆదాయం వస్తోంది. కనీసం ఇలాంటి క్లిష్ట పరిస్థితి ఏర్పడినప్పుడు ఓ నాలుగు కోట్లు ఖర్చుపెట్టి పంటలను రక్షించడానికి మాత్రం ప్రభుత్వం పూనుకోవడం లేదు. రైతులనుండి ప్రభుత్వానికి ఆదాయం రావడమే తప్ప వారి సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనేని స్పష్టం. రైతులు ఈ విధమైన దుస్థితిలో ఉండటానికి పురుగుమందుల కల్తీ కూడా ఓ కారణం. గుంటూరు, రంగారెడ్డి జిల్లాల కేంద్రంగా నిజామాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కల్తీ వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతోంది. ఇది క్రిమిసంహారక మందులకే కాకుండా విత్తనాలకు కూడా వ్యాపించింది. ఒక పెద్ద మాఫియా మార్కెట్ దీనిని నిర్వహిస్తోంది. అనేక సందర్భాల్లో ప్రభుత్వం వీరిని పట్టుకున్నప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వలన కల్తీ నిర్విఘ్నంగా సాగుతోంది. దీని గురించి ప్రభుత్వానికి తెలిసినా చట్టాలు ప్రభుత్వానికి అనుకూలంగా లేవనే సాకు చూపెడుతోంది. రైతులు ఈ కల్తీ వలన కోట్ల కొలది రూపాయలు నష్టపోతున్నారు. జిల్లాలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పినా అది జరగలేదు. పైగా శాంపిల్సు తీసుకొనే సమయంలో తక్కువ మోతాదు ఉన్నవి సేకరిస్తున్నారు. దీని వలన లీటర్, ఆపై మోతాదు డబ్బాల్లో కల్తీ యధేచ్ఛగా సాగుతోంది. 5 లీటర్ల బాటిళ్ళ కొనుగోలుకు ప్రభుత్వం డబ్బులివ్వదనే పేరుతో తక్కువ మోతాదులో ఉన్న బాటిళ్లను అధికారులు శాంపిల్‌కు తీసుకుంటున్నారు. రెండు సంవత్సరాల క్రితం వరంగల్ కోర్టులో కల్తీపై 800 కేసులు నమోదయ్యాయి. ఇంత వరకు వాటికి పరిష్కారం లేదు. ఈ స్థితిలో కొత్తగా కల్తీ బారినపడ్డ వారు కోర్టుకు వెళ్ళేందుకు కూడా సుముఖంగా ఉండటం లేదు.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం తరపున ఈ సమస్యను వెనువెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో సఫలమయ్యాం. తక్షణమే చనిపోయిన వారికి లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వమే పూర్తిగా ఖర్చు భరించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ విషయంలో ప్రభుత్వం విఫలమైతే అక్టోబర్ 15 నుండి బాధిత కుటుంబాలతో మండల కార్యాలయాల ఎదుట ఆందోళన చేపడతాం. ☆

వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామంలో పురుగుమందులు స్ప్రే చేయకపోవడంతో అక్కడ పురుగులు లేవు. వున్న కొద్దిపాటి పురుగులను సహజంగా ప్రకృతిలో వుండే పక్షులు నాశనం చేశాయి. ఈ విషయాన్ని వ్యయసాయశాఖ ఆలస్యంగా గుర్తించింది. దీన్ని రైతుల్లో విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరముంది. జిల్లాలో 80 వేల మంది రైతులు నిత్యం పురుగు మందు కొడ్తూనే వున్నారు. ఈ సీజన్‌లో దాదాపు 100 కోట్ల రూపాయల పురుగుమందుల వ్యాపారం జరుగుతుందని అధికారులు, వ్యాపారులు చెప్తున్నారు. నిషేదిత సింథటిక్ పైరిత్రాయిడ్స్ విక్రయిస్తున్నా పట్టని వ్యవసాయ శాఖాధికారుల తీరుపట్ల పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సింథటిక్ పైరిత్రాయిడ్స్‌పై నిషేదం ఎత్తివేతతో వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల ప్రమేయం వుందన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవు తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న వరంగల్ పత్తి రైతుల మరణాలకు ఆలస్యంగా వ్యయసాయ శాఖ మేల్కొని కరపత్రాల ద్వారా ప్రచారాన్ని చేపట్టింది. వ్యవసాయాధికారులను జీపులను ఇచ్చి గ్రామాలకు పంపుతున్నారు. డీలర్లకు సైతం పురుగుమందుల వాడటం, వాటి దుష్ఫలితాలను వివరించడానికి శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. విష ప్రభావానికి అస్వస్థతతకు గురైె ఆస్పత్రిలో చేరే రైతుల చికిత్సకై డాక్టర్లకు విరుగుడు మందుల గూర్చి అవగాహన కల్పించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పురుగుమందులను పిచికారీ చేసే సమయంలో రైతులు తగు రక్షణ ఏర్పాట్లను, కనీస జాగ్రత్తలను తీసుకోవడం లేదని వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి వెంకటరెడ్డి చెబుతున్నారు. ముక్కుకు గుడ్డలు కట్టుకోకపోవడం, గ్లౌజెన్ ధరించకపోవడం, పిచికారి చేస్తూనే మాట్లాడడం, సిగరెట్, బీడిలు కాల్చటం, గుట్కాలు నమలడం వంటివి చేయడం వల్ల రైతులు అనారోగ్యానికి గురవుతున్నారు. చేతులను సరిగ్గా శుభ్రం చేయకుండానే ఆహారం తీసుకోవడం, నీరు తాగడంతో మరింతగా ప్రాణహాని కల్గిస్తుందని ఆయన అంటున్నారు.



పురుగు మందుల ప్రబావంతో అస్వస్థతకు గురైన పత్తి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం తరుఫున అన్ని చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ జిల్లా కలెక్టర్ కె.ప్రభాకర్‌రెడ్డి అంటున్నారు. చనిపోయిన రైతులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేం. కాని ఆపద్బంధు పథకం కింద వారి కుటుంబీకులకు ఆర్థిక సహాయం చేస్తామని, రైతులను చైతన్యవంతం చేసేందుకుగాను కరపత్రాలు పంచుతున్నామని చెప్పారు. అలాగే ప్రతి గ్రామంలో డప్పు చాటింపు చేయిస్తూ ప్రచారం చేయిస్తున్నామని. రైతులకు ముఖానికి మాస్క్, శరీరాన్ని కప్పే డ్రెస్‌లను డీలర్ల ద్వారా సరఫరా చేయడానికి తగు చర్యలు తీసుకున్నామని. అవసరమైతే 50 శాతం సబ్సిడీతో రైతులకు సింథటిక్ డ్రెస్‌లు అందజేస్తామని చెబుతున్నారు.

వ్యవసాయ శాఖగాని, ప్రభుత్వం గాని ముందుగా మేలుకుని పురుగు నివారణ విషయంలో రైతులను మేల్కొల్పి ఉంటే వారు నకిలీ పురుగుల మందుల డీలర్ల బారిన పడేవారు కాదు. బహుళ జాతి కంపెనీలు ఇతర దేశాలల్లో నిషేధించిన మందులను ఇక్కడ విచ్చలవిడిగా అమ్ముతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడమే కాదు, వాటికి అనేక విధాలుగా సహకరిస్తోంది. కల్తీ పురుగు మందుల నిషేధ చట్టంలో లొసుగులను కూడా ఈ కంపెనీలు తమకే అనుకూలంగా మార్చుకుంటున్నాయి. ఇంత జరిగిన తరువాత ఇప్పుడు ప్రభుత్వం పురుగుపై పోరు సల్పుతానంటోంది. పురుగు మందు చల్లే వారికి శిక్షణనిస్తామని, కిట్లు సరఫరా చేస్తామని అంటోంది. ఈ పనులనైనా అధికార యంత్రాంగం అత్యంత వేగంగా కదిలి యుద్ధ ప్రాతిపదికపై చేస్తేనే ఫలితముంటుంది. రాష్ట్ర ప్రభుత్వం గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి. తక్షణం వ్యవసాయ శాఖను రంగంలోకి దించి కరపత్రాల ద్వారా, ఇతర ప్రచార సాధనాల ద్వారా పురుగు నివారణపై పత్తి రైతుల్లో ప్రచారం చేయాలి. క్రిమి సంహారక మందుల వాడకంలో రైతులను జాగృతం చేయాలి.

ప్రజాశక్తి ప్రతినిధి, వరంగల్

టాన్సిల్స్‌ను తొలగిస్తే పొడుగ్గా పెరుగుతారా?

తరచుగా వచ్చే వ్యాధి గొంతు నొప్పి. మనం తీసుకొనే ఆహారం లోనూ, పీల్చే గాలిలోనూ ఉండే కాలుష్యాల వలన, సూక్ష్మ జీవుల ప్రభావం వలన గొంతు తరచుగా చిన్నా పెద్ద వ్యాధులకు గురవుతూ ఉంటుంది. ఇలా వచ్చే వ్యాధులలో ముఖ్యమైనవి 'ట్రాన్సిల్‌లైటిస్'. టాన్సిల్స్‌ను తొలగించడం వల్ల పిల్లలు ఎత్తు బాగా పెరుగుతారని అపోహ కొందరిలో ఉంటుంది. కాని అది నిజం కాదని నిపుణులైన ఇ.ఎన్.టి. డాక్టర్లు తాము రాసిన పుస్తకాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. టాన్సిల్స్ ప్రతి ఒక్కరికి ఉంటాయి. బాదంకాయ ఆకారంలో కుడి వైపున ఒకటి, ఎడమ వైపున మరొకటి ఉంటాయి. పిల్లల విషయంలో ఇవి రెండేళ్ళ పసి వయసులో ఏ జబ్బూ లేకున్నా వాపు చూపిస్తూ వుంటాయి. వయసు పైబడే కొద్దీ క్రమంగా క్షీణించి పోతాయి.

ఈ టాన్సిల్స్ ఎందుకు? వాటి ఉపయోగం ఏమిటనే ప్రశ్నలకు ఇంతవరకు స్పష్టమైన సమాధానాలు దొరకలేదు. ఈ అంశం ఇంకా వివాదాస్పదంగానే వున్నప్పటికీ ఆరోగ్యవంతంగా వున్న టాన్సిల్స్ చిన్నపిల్లలలో జబ్బులు రాకుండా దేహ రక్షణకు తోడ్పడతాయని తేలింది. ఏ కారణం వల్లనైనా వీటికి చీము పడితే అవి దేహ రక్షణ విధులను సరిగా నిర్వర్తించలేకపోవటమే గాక, ఆ చీము రక్త నాళాల ద్వారా దేహంలోని ఇతర అవయవాలకు సోకే ప్రమాదం వుంది. టాన్సిల్స్‌కు చీము పట్టి కలిగే వ్యాధినే 'టాన్సిలైటిస్' అంటారు. ఈ వ్యాధి ఎక్కువగా చిన్నపిల్లల్లోనే కనిపిస్తుంది. జనసమ్మర్దం ఎక్కువగా వుండే ప్రాంతాలలో నివసించే వారికి, సదా అనారోగ్యంగానూ, బలహీనంగానూ వుండే పిల్లలకు ఈ వ్యాధి తరచుగా వస్తూ వుంటుంది. వేసవి కాలంలో తక్కువగానూ, వర్షాకాలం, చలికాలాలలో తరచుగానూ వస్తూ వుంటుందీ వ్యాధి. టాన్సిల్స్ వాచినప్పుడు గొంతు నొప్పితో ఆహారం మింగాలంటే కష్టంగా వుంటుంది. 102-103 డిగ్రీల జ్వరం కూడా రావచ్చు. టాన్సిల్స్ ఈ దశలో ఎర్రబడుతూ వుంటాయి. వాచిపోయి పైన తెల్లని చుక్కలు కనిపించవచ్చు. దవడ కింద భాగం కూడా వాచిపోతుంది. ఇది ఒక రకంగా అంటు వ్యాధి వంటిదే. టాన్సిల్స్‌కు ఇలా తరచుగా చీము పడుతున్న పక్షంలో ఆ చీము చేయి వరకు పాకి చెవి నొప్పి కలగడంతో పాటు చెవిలో నుండి కూడా చీము కారటం ప్రారంభం అవుతుంది. ఈ పరిస్థితి ఒకోసారి గుండెజబ్బులకు కూడా దారితీయవచ్చు. కీళ్ళ వ్యాధులకు మూత్ర పిండాల జబ్బులకు కూడా కారణం కావచ్చును. జీర్ణకోశం దెబ్బతినే ప్రమాదం కూడా లేకపోలేదు. టాన్సిలైటిస్ వ్యాధికి మూలకారణమైన సూక్ష్మ క్రిమిని స్ట్రెప్టోకాకస్, హిమాలిటికస్ అంటారు. ఈ సూక్ష్మక్రిమి చాలా హానికరమైనది. టాన్సిల్స్‌కు చీము పట్టినప్పుడు బాగా విశ్రాంతి తీసుకోవాలి. ఉప్పు నీళ్ళతో పుక్కిలించడం ద్వారా శుభ్రం చేసుకోవాలి. జ్వరం, నొప్పి ఉపశమించేందుకు గాను తగిన మందులు వాడాలి. వ్యాధి ప్రథమ దశలో పెన్సిలిన్ ఇంజక్షన్ తీసుకోవాలి. అయినా ఈ జబ్బు తరచుగా వస్తున్న పక్షంలో మాత్రం మందుల వలన తాత్కాలిక ప్రయోజనమే గాని, శాశ్వత నివారణ సాధ్యం కాదు. అందుకు శస్త్ర చికిత్సే శరణ్యం.

టాన్సిల్స్‌ను తీసివేస్తే పిల్లలు బాగా పొడుగ్గా పెరుగుతారని నమ్మకం మనలో అనాదిగా వుంటున్నది. అందువలననే పిల్లలు ఏ మాత్రం నలతగా కనిపించినా అందుక్కారణం టాన్సిల్సేనని భావిస్తూ వాటిని తీసివేయమని కోరుతుంటారు. కాని అది సరైన పద్ధతి కాదు. టాన్సిల్స్‌ను తీసివేసినందువలన పిల్లలు పొడుగ్గా పెరుగుతారనేది కేవలం భ్రమ. చీటికి మాటికి చీముపడుతూ జ్వరానికి కారణం అవుతున్న సందర్భాలలో మాత్రమే అనారోగ్య కారకంగా పరిణమించిన టాన్సిల్స్‌ను మాత్రమే ఆపరేషన్ ద్వారా తొలగించటం మంచి పద్ధతి. ఆ వయసులోని వారి దేహ రక్షణ బాధ్యతల నిర్వహణకు అవి అవసరం కూడా. అలాగే వృద్ధులకు కూడా టాన్సిల్స్‌ను తొలగించవలసిన అవసరం లేదు. కేవలం 5 నుండి 50 సంవత్సరాల మధ్య వయసులోని వారికి మాత్రమే. అదైనా తరచుగా వ్యాధికి గురవుతున్న టాన్సిల్స్ వున్నప్పుడే చికిత్స ద్వారా తొలగించాలి. ☆

ధూమపానం తెచ్చే నష్టాలు

డా॥ సమ్మెట గోవర్ధన్

నేడు ప్రపంచ వ్యాప్తంగా సుమారు 1,100 మిలియన్ల పొగతాగేవారున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా. వీరిలో అధిక శాతం అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన పురుషులని తెలుస్తోంది. పొగాకు ఉత్పత్తిలో మన దేశం ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. మన దేశంలో సుమారు 3.7 కోట్ల మంది సిగరెట్ తాగేవారున్నట్టు అంచనా. పశ్చిమ దేశాల్లో మాదిరిగా కాకుండా, మన దేశంలో పొగాకు మూడు రకాలుగా వినియోగంలో వుంది. బీడీలు, పాన్‌మసాలా, సిగరెట్ల రూపంలో పొగాకు వాడుతున్నారు. పిల్లవాడిగానే పొగతాగడం నేర్చిన వ్యక్తులు యుక్త వయస్సులో కూడా ఈ దురలవాటును కొనసాగించడం వల్ల, వీరు జీవితకాలం కన్నా 9 సంవత్సరాల ముందుగానే మరణిస్తున్నట్లు పరిశోధనలు తెలుపుతున్నాయి. ఒకసారి అలవాటైన తరువాత పొగమానడం అంత సులభమైన విషయం కాదు. పొగమానే ప్రయత్నంలో ఉన్నవారు, కొన్ని నెలల తరువాత తిరిగి పొగతాగడానికే మొగ్గు చూపడం గమనార్హం. సిగరెట్లలో గల 'నికోటిన్' ఇందుకు కారణం. నికోటిన్‌కు అవాటు పడిన వారు దానికి బానిసలైపోతారు. హెరాయిన్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాల్లాగే నికోటిన్ మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐ.సి.యం.ఆర్.) అధ్యయనం ప్రకారం పొగాకు వినియోగ సంబంధ వ్యాధుల కారణంగా 1999లో మన దేశం సుమారు రు.27761 కోట్లు ఖర్చు చెయ్యాల్సి రాగా, పొగాకు ఉత్పత్తుల ద్వారా లభించిన ఆదాయం రు.24400 కోట్లు మాత్రమే. దీన్ని బట్టి పొగాకు వినియోగం దేశానికి నష్టదాయకమని, దాని నియంత్రణకు చేపట్టే ఏ చర్యఅయినా సమాజానికి లాభదాయకమని తెలుస్తోంది. పొగతాగడం ప్రపంచ ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తోంది. సిగరెట్ తాగడం వల్ల సంభవించగల నష్టాల గూర్చి ఎన్నో దశాబ్దాలుగా పరిశోధనలు జరుగుతున్నాయి. సిగరెట్ తాగడం ఎన్నో అకాల మరణాలకు దారితీస్తోంది. సిగరెట్ తాగుతున్న కాలం పెరిగిన కొద్దీ వ్యక్తి అనారోగ్యం పాలయ్యే అవకాశాలు పెరుగుతాయి. పొగతాగడం ఎంత నష్టదాయకమో ఈ

క్రింద పేర్కొన్న విషయాలను పరిశీలిస్తే అవగతమవుతుంది.

★ క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ వ్యాధుల్లో 80-90 శాతం పొగతాగడం వల్ల వస్తాయి. ఇంకా

★ 85 శాతం ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాలు

★ నోటి, కడుపు, మూత్రాశయ క్యాన్సర్‌లు పొగతాగడం వల్ల వస్తాయి.

★ పొగతాగడానికి, ల్యుకేమియా రావడానికి గట్టి సంబంధం ఉందని తెలుస్తోంది.

ఇలాంటి వైద్యపరమైన సంక్లిష్టతలతో పాటు, పొగతాగే వారి జీవన విధానమూ క్రమం తప్పుతుంది. పనికి సక్రమంగా హాజరు కాకపోవడం, పని నైపుణ్యం తగ్గుదల, శారీరక శ్రమ తరువాత ఊపిరి ఆడకపోవడం, సంభోగశక్తి తగ్గుదల కన్పిస్తాయి. రోజుకు 20 సిగరెట్లు కాల్చేవారి పిల్లలు సైతం నికోటిన్ దుష్ప్రభావం బారిన పడతారు. పొగతో నిండిన పరిసరాలు పిల్లల్లో బ్రాంకైటిస్, న్యుమోనియాతో పాటు, చెవి వ్యాధులకు కారణమవుతాయి.

పొగతాగడం మానివేసిన 20 నిమిషాల నుండే దేహంలో ఉపయుక్తమైన మార్పులు సంభవించగలవని పరిశోధనలు తెలుపుతున్నాయి. మానివేసిన కాలం, సంభవించగల ఉపయుక్త మార్పుల వివరాలు ఈ విధంగా వున్నాయి.

20 నిమిషాలు

☞ రక్తప్రసరణ సాధారణ స్థాయికి చేరడం ప్రారంభమవుతుంది.

☞ చేతులు, పాదాల ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి పెరుగుతుంది.

8 గంటలు

☞ రక్తంలోని ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్ సాధారణ స్థాయికి చేరతాయి.

24 గంటలు

☞ గుండెపోటు వచ్చే అవకాశాలు తగ్గుతాయి.

48 గంటలు

☞ నాడుల కొనలు తిరిగి పెరగడం ప్రారంభమవుతుంది

2 వారాల నుండి 3 నెలలు

☞ రక్తప్రసరణ మెరుగవుతుంది

☞ ఊపిరితిత్తుల పనితనంలో 30 శాతం అభివృద్ధి కన్పిస్తుంది.

1-9 నెలలు

✈ దగ్గు, సైనస్ కంజెషన్, అలసట, ఊపిరి ఆడకపోవడం తగ్గుతుంది.

✈ ఊపిరితిత్తుల్లో ఓలియా తిరిగి పెరుగుతాయి. ఫలితంగా ఊపిరితిత్తుల పనితనం మెరుగవుతుంది. ఊపిరితిత్తులు శుభ్రమవుతాయి. ఇన్‌ఫెక్షన్ అవకాశాలు తగ్గుతాయి.

పొగతాగడం అనారోగ్యకరమని ఎన్ని పరిశోధనలు తెలిపినప్పటికీ, ప్రజలు ఈ దురలవాటుకు దూరం కాకపోవడం విచారకరం. వైద్య సహాయం, కౌన్సిలింగ్, ఆశావహ దృక్పథం ఈ దురలవాటును దూరం చేస్తాయి. పొగమానడం వల్ల నష్టపోయేదేమీ లేదన్న విషయం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ☆



నా వయస్సు 18 సం॥లు. సంవత్సరం నుండి నేను బాగా కాండ్రించి ఉమ్మి వేస్తున్నాను. డాక్టర్లు మందులు రాశారు. వాడినా తగ్గలేదు. రక్తపరీక్ష చేసి ఈసినోఫిలియా ఉందని చెప్పారు. తగు వైద్య సలహా చెప్పగలరు.

- యు.రమేష్ బాబు, తిరువూరు

ఈసినోఫిలియా నివారణకు గాను హెట్రజాన్ 100 మిల్లీ గ్రాముల బిళ్లల్ని రోజుకు మూడు చొప్పున రెండు వారాలు వాడండి.

పడిశం పట్టినప్పుడు తుమ్ములు, దగ్గు, ఆయాసం, జ్వరం వస్తోంది. డాక్టర్లు ఇది అలర్జీ అని, మందులు లేవని అంటున్నారు. నిజంగా ఏ మందూ లేదా?

- జి.చలమయ్య, మదనపల్లి

అలెర్జీని ఎప్పటికీ రాకుండా నయం చేయలేము. ఎక్కువ సందర్భాలలో అలెర్జీని కలిగించే పదార్థాన్ని కనుక్కోలేక పోవటంతో పాటు అనేక పదార్థాలు కలగలిసి కూడా కారణమవుతున్నందున ఓపికగా వైద్యం చేయించుకోలేకపోవటమే దీనికి కారణం. అయితే నియంత్రించే అవకాశం ఉంది. మందులు లేవని ఆందోళన పడాల్సిన పని లేదు. కారణం అర్థం అయితే వీలయినంత వరకూ అలాంటి వాటికి దూరంగా ఉండటం మేలు.

నా వయస్సు 17 సం॥లు. నా ఎత్తు 120 సెం.మీ. నా పాదాలు కూడా చాలా చిన్నవిగా, ఉబ్బుగా ఉంటాయి. నేను ఎత్తు పెరగడానికి మార్గం ఏమీ లేదా?

- ఒక సోదరి, కోదాడ

మనుషులు 25 ఏళ్ళు వచ్చే వరకూ పెరిగే అవకాశం ఉంది. మీరు ఎదగటానికి ఇంకా ఎనిమిది సంవత్సరాల పాటు అవకాశం ఉంది. తల్లితండ్రులను బట్టి కూడా బిడ్డల ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. మీరు ఎండో క్రైనాలజిస్టును సంప్రదించండి. వ్యాయామం మీకు ఉపకరించవచ్చు.

నా వయస్సు 16 సం॥లు. నా ఎత్తు 7 అడుగుల ఒక అంగుళం. ఎత్తు తగ్గడానికి ఏదైనా సలహా ఇవ్వండి?

- ఎం.బాలాజీరావు, కృష్ణాజిల్లా

పొట్టివాళ్లను పొడుగు చేయలేనట్లే పొడుగు వాళ్లను కూడా పొట్టిగా చేయలేము. గ్రోత్ హార్మోను విడుదల అధికంగా ఉన్న కారణంగా ఎత్తు పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. మీరు వెంటనే ఎండో క్రైనాలజిస్టును సంప్రదించండి.

నేను ఇంటర్ చదువుతున్నాను. నా ముందు మూడు పళ్ళు ఎత్తుగా వున్నాయి. వాటితో చాలా ఇబ్బందిగా వుంది. ఎత్తు తగ్గించవచ్చని ఇటీవల ఒక వ్యాసంలో చదివాను. పూర్తి అడ్రస్‌తో నాకు సలహా ఇవ్వగలరు.

- ఎం.రాజేంద్ర సతీష్, సంగారెడ్డి

ఎండిఎస్ ఆర్థోడెంటిస్ట్‌ను హైదరాబాదులో సంప్రదిస్తే మీ సమస్యను పరిష్కరించుకోవచ్చు.

- డా॥ కొల్లా నాగేశ్వరరావు,
ఎం.ఎస్. డి.ఎల్.ఓ., ఒంగోలు




యుద్ధం జరుగుతుందని
తాత, జరగదని బామ్మ
రోజూ ఇదేవరసరా
చిన్నా..!


కనీసం..మూడేళ్ళైనా
కరెంట్ బిల్లు భారం
నీమీద పడకుండా ఉండాలని....

పిల్లల తగాదాల్లో పెద్దల జోక్యం వద్దు

సింహాద్రి సరోజిని

పిల్లల తగాదాల్లో పెద్దల జోక్యాన్ని గురించి ఆలోచిస్తే చిన్నప్పుడు చదివిన ఓ కథ జ్ఞప్తికి వచ్చింది. రామయ్య, రంగయ్య అనే ఇద్దరి కుటుంబాలు పక్కపక్కనే వుండేది. వారిద్దరి పిల్లలూ రోజూ కలిసి ఆడుకోవడం, బడికి పోవడం, చదువుకోవడం చేసే వారు. ఒక రోజెందుకో రామయ్య కొడుకు, రంగయ్య కొడుకూ తన్నుకుంటున్నారు. అది చూసి వారెందుకు కొట్టుకుంటున్నారో తెలుసుకొని పిల్లల్ని సరిచేయాల్సింది పోయి పెద్దలు తగాదాకు దిగారు. చివరకు అది చిలికి చిలికి గాలి వానగా మారి పెద్ద తగవుగా మారింది. అది చాలా చిన్న గ్రామం కావడంతో ఊరిలోని వారంతా అక్కడ చోద్యం చూడసాగారు. పెద్దల తగాదా కొనసాగుతూ వుండగానే మరలా ఆ పిల్లలిద్దరూ పక్కన ఆడుకోసాగారు. అది చూసిన ఒక వృద్ధుడు రామయ్యను, రంగయ్యను, గ్రామ ప్రజలందరినీ పిలిచి పిల్లలు ఆడుకుంటున్న దృశ్యాన్ని చూపించాడు. చిన్న పిల్లలు ఆటల్లో కొట్లాడుకోవడం, మరలా కలిసి పోవడం సహజమేనని ఆ వృద్ధుడు వారికి హితవు చెప్పాడు. దానితో రామయ్య, రంగయ్య తమ తప్పు తెలుసుకొని తమ చర్యకు సిగ్గుపడ్డారు. జరిగిన దానికి క్షమాపణ చెప్పుకొని ఎప్పటిలాగానే కలిసి మెలిసి వుండసాగారు.

ఈ కథను బట్టి చూస్తే మనకు అర్థమయ్యేదేమిటంటే పిల్లల ప్రతి తగవులోనూ పెద్దలు జోక్యం చేసుకోకూడదు. తగవు మరీ తీవ్రంగా వుంటే మాత్రం వారిని దగ్గరకు చేరదీసి విషయం తెలుసుకోవాలి. తప్పు ఎవరిదైతే వారికి ఆ విషయం తెలియజేయాలి. మరోసారి అలాంటి చిన్న విషయాల్లో తగవు పెట్టుకోవద్దని వారికి నచ్చచెప్పాలి. అలాగాక ఎవరికి వారే తమ పిల్లవానిదో లేక పిల్లదో ఎలాంటి తప్పు లేదని నిర్ధారణలకు వచ్చి తగాదాకు దిగడం ఏమంత మంచి పద్ధతి కాదు.

నా స్నేహితురాలొకామె వుంది. వాళ్ళ అమ్మాయి, నాలుగిళ్ళ అవతల వుంటున్న వారి పాప ఒకే ఈడు వారు. వారెప్పుడూ జంటకవుల్లా ఎప్పుడూ ఒకే చోట ఆడుకుంటూ వుంటారు. ఒకరిని చూడకుండా ఒకరు వుండలేరు. నిద్రలేచింది మొదలూ నిద్రపోయే వరకూ ఎప్పుడూ కలిసి ఆడుతూనే వుంటారు. ఆటల్లో వారు చాలా తరచుగా తగాదా పడుతుంటారు. ఇద్దరూ ఒకే బొమ్మతో ఆడాలని పోటీ పడుతుంటారు. ఈ విషయంలో కొట్టుకుంటూ వుంటారు కూడా. వారలా కొట్టుకున్నప్పుడు నా స్నేహితురాలు ఇద్దరికీ నచ్చజెప్పి వాళ్ళ అదే బొమ్మతో కలిసి ఆడుకునేలా చేస్తుంది. పక్క వారు కూడా తమ ఆటల్లో తమ పిల్లకు దెబ్బలు తగిలినా చూసీ చూడనట్లు వుంటారు మినహా ప్రతిదానికీ తగాదాకు రావడం నేనెన్నడూ చూడలేదు.

అయితే దీనికి వ్యతిరేకమైన సంఘటన కూడా ఒకటి నాకు జ్ఞాపకమొస్తోంది. మా ఆంటీగారి యింట్లో రెండు కుటుంబాలు అద్దెకుండేవి. వారు ఎంతో స్నేహంగా వుండేవారు. పిల్లలు కూడా చాలా కలిసిమెలిసి వుండేవారు. అయితే ఒక రోజు పిల్లలెందుకో తగాదాపడితే వారి తల్లిదండ్రులు తమ స్నేహాన్ని మరచి రోడ్డున పడి తగవులాడుకున్నారు. తగవు మరీ ముదిరి పోవడంతో ఒకరు ఇల్లు ఖాళీ చేసి కూడా వెళ్ళారు. ఆ సంఘటన గురించి విని నేను చాలా ఆశ్చర్యపడ్డాను. పిల్లలు ప్రాణస్నేహితులుగా వుండి వారి తల్లిదండ్రులు ఆగర్భ శత్రువుల్లా వుండటం చాలా ఎబ్బెట్టుగా వుంటుంది గదా!

ఇలా పిల్లల మధ్య తగాదాలొచ్చినప్పుడు పెద్దలు ఏకపక్షంగా తమ పిల్లల మాట మాత్రమే నమ్మి ఒక నిర్ణయానికి రాకూడదు. అలా చేస్తే మన పిల్లలు అబద్ధాలు చెప్పే అవకాశం కూడా వుంటుంది. తమ తప్పును కప్పిపుచ్చుకొనేందుకు కథలల్లవచ్చు. అది మన పిల్లలకే మంచిది కాదు. ఎప్పుడైనా పిల్లలు గొడవపడితే ఇద్దరినీ కూర్చోబెట్టి అసలు జరిగిందేమిటో వారినే అడిగి తెలుసుకోవాలి. వారిద్దరూ చెప్పింది విన్నతరువాత అందులో ఎవరి తప్పు ఏ మేరకు వుందో వారికి వివరించాలి. అలా చేసినప్పుడు పెద్దల్లో అపార్థాలకు తావుండదు.

చివరగా మరో విషయమేమంటే అసలు పిల్లలు తమ తగాదాలను తావే పరిష్కరించుకోగలరు. పిల్లల తగాదాలు తామరాకుమీద నీటి చుక్కల్లాంటివే. వారు అంతలోనే తగవు పడతారు. మరుక్షణమే దానిని మరచి కలిసిపోతారు. కాబట్టి పిల్లల తగాదాల్లో పెద్దల జోక్యం వుండకపోవడమే మంచిది. అవసరమనుకున్నప్పుడు మాత్రం పిల్లలకు సంబంధించిన పెద్దలు కూర్చొని పిల్లలకు వారి తప్పులను తెలియజెప్పాలి. కాబట్టి పెద్దలూ ప్రతీ చిన్న పిల్లల తగాదాలోనూ జోక్యం చేసుకొని మీ మధ్యవున్న సత్సంబంధాలను చెడగొట్టుకోరుగా! ☆



'సిగ్గుపడిన పులి'

అనగనగా ఓ అడవిలో ఆవు-దూడ ఉన్నాయి. దూడ అంటే ఆవుకు పంచప్రాణాలు. అలాగే తల్లి ఆవును విడిచి దూడ ఒక్క క్షణం ఉండేది కాదు. సంతోషం వచ్చినప్పుడల్లా దూడ తోక పైకెత్తి చెంగు చెంగున ఎగురుతూ తల్లివద్దకు వచ్చి అంబా అంబా అంటూ గారాబం చేసింది. లేగదూడ చేష్టలకు ఆవు ఎంతో మురిసిపోయింది.

ఓ రోజు ఉదయం దూడ ఎంతకూ నిద్రలేవలేదు. లేపటం ఎందుకులే అని గోమాత ఒక్కటే మేతకు వెళ్ళింది. పచ్చిక బయలుపై చక్కగా మేస్తున్న ఆవును పులి చూడనే చూసింది. ఇంకేముంది దగ్గరకు వెళ్ళి మీదపడి చంపాలనుకున్నది. మీదపడిపోయింది.

అంతలో ఆవు "పులి రాజా! పులి రాజా! ఒక్క క్షణం ఆగు. నీవు నన్ను చంపేస్తావని నాకు తెలును. నా మరణం నిశ్చయమైపోయింది. చనిపోయేముందు చనిపోయేవారి కనీస కోర్కె తీర్చడం ధర్మం' అన్నది.

'నీ కోర్కె ఏమిటో త్వరగా చెప్పు' అంటూ గాండ్రించింది పులి.

'నాకు ఒక్కగానొక్క దూడ. నేను చచ్చిపోతే దాని ఆలనా పాలనా ఎవరు చూస్తారు?' అన్నది ఆవు.

'ఇది అడవి. ఎవరి కెవరూ ఏమీ చూడక్కరలేదు. ఎవరి బతుకు వారు బతకాల్సిందే, అలాగే బతుకుతారు కూడా' అని బదులిచ్చింది పులి.

'ఇదే విషయాన్ని దూడకు చెప్పి వస్తాను. నీ ఆకలి తీరుస్తాను' అంది ఆవు.

'ఏమక్కరలేదు. నేను నీతో పాటు వచ్చి ఇదే విషయాన్ని నీ దూడకు చెబుతాను పద' అంది పులి.

అంబా...అంబా...అంటూ అమ్మకోసం తల్లడిల్లిపోయిన దూడకు గోమాత. వెనకాలే పులి కనిపించడంతో నిశ్చేష్టురాలయ్యింది. ఒక్క క్షణం ఉండి ఇక ఆగలేక వెంటనే అమ్మ వద్దకు పరిగెత్తబోయింది...

'ఆగు దూడ..ఆగక్కడ. ఇక నీకు అమ్మ ఉండదు. మీ అమ్మను నేను చంపితింటాను. ఇక నుండి నీ బతుకు నీవు బతకాలి' అంటూ గాండ్రించింది.

ఆ గాండ్రింపుకు దూడ భయపడి పారిపోతుందని పులి తలంచింది. కాని లేగదూడ పారిపోలేదు సరికదా అక్కడే పెద్దగా నవ్వడం మొదలెట్టింది. దూడ అలా ఎందుకు నవ్వుతుందో గోమాతకు కూడా అర్థం కాలేదు.

పులి వెంటనే 'ఏమిటా పిచ్చి నవ్వు. ఆపు' అని పెద్దగా అరిచింది.

దూడ నవ్వు ఆపుకుంటూ 'పిచ్చిరాజా! పిచ్చిరాజా! ఎక్కడైనా, ఎవరైనా అమ్మ లేకుండా బతుకుతారా. అమ్మపాలు తాగకుండా ఎలా బతుకుతాం? నువ్వైనా అమ్మ లేకుండా, అమ్మ పాలు తాగకుండా బతికావా ఏంటి. మా గొప్పగా గాండ్రిస్తున్నావ్!' అంటూ బుంగమూతి పెట్టింది.

లేగదూడ ప్రశ్నకు పులికి మతిపోయింది. అవును! నేను కూడా అమ్మలేకుండా బతకలేదు కదా? అంటూ సిగ్గుపడిపోయింది పులి. ఇంతకీ మా అమ్మ ఇప్పుడు ఎక్కడ ఉందబ్బా అంటూ వాళ్ళ అమ్మను వెతుక్కుంటూ వెళ్ళిపోయింది పులి.

-శైలి

కథలు పంపండి

నేస్తాలూ,

మీరు ఏమైనా కథలు రాస్తే వాటిని ఈ శీర్షికకు పంపండి. బాగున్న వాటిని వీలు వెంబడి ప్రచురిస్తాం. మీరు పంపే కథలు విజ్ఞానం అందించేవి గాను, మంచి విషయాలు బోధించేవి గాను ఉండాలి. ఇప్పటికే వచ్చిన కథలు కాకుండా మీరు సొంతంగా రాసిన కథలు పంపండి. మీ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చూపించి వారి సంతకంతో పంపితే ప్రచురిస్తాం.



కలంస్నేహం

పేరు: ఆసియా సుల్తానా
వయస్సు: 16
చదువు: 10వ తరగతి
హాబీలు : పేపర్స్ చదవడం, పాటలు పాడటం
పూర్తి చిరునామా: డాటరాఫ్ అక్బర్ అలీ, సాధన కోచింగ్ సెంటర్, ఇ.నెం : 7-1-145, 24 డిప్ ఏరియా, పాతబస్టాండ్, పోస్టాఫీస్ బస్తీ, బెల్లంపల్లి, ఆదిలాబాద్ జిల్లా-504251.

పేరు: ఎం. హరికృష్ణ
వయస్సు: 7
చదువు: 2వ తరగతి
హాబీలు: క్యారమ్స్, చెస్ ఆడటం, టీవీ చూడటం, కరాటే చేయడం.
పూర్తి చిరునామా: కేరాఫ్ న్యూ భారతి పబ్లిక్ స్కూల్, (పో) తుర్కపల్లి (మం) వలిగొండ, (జి) నల్లగొండ

పేరు: ఎస్. సాయిలు
వయస్సు: 15
చదువు: 10వ తరగతి
హాబీలు: క్యారమ్స్ క్రికెట్ ఆడటం, మంచి నవలలు చదవడం
పూర్తి చిరునామా: సన్నాఫ్ ఎస్. మారుతి, (గ్రా) గున్కుల్, (మం) నిజాంసాగర్ (జి) నిజామాబాద్-503 302.



ఒకే విధంగా ఉన్నవి ఏవి?

చిన్నారి చిత్రకారులు

'అగ్గిపుల్లలతో ట్రిక్'



నేస్తాలూ,

మీరు రోజూ అగ్గిపుల్లలను చూస్తూనే ఉంటారు కదా. ఆ అగ్గిపుల్లలతో ఎన్నో ట్రిక్కులు చేయవచ్చు. వాటితో మీ స్నేహితులను ఆటపట్టించవచ్చు. వారి కన్నా మీకు ఎక్కువ విషయాలు తెలునని నిరూపించుకోవచ్చు. అగ్గిపుల్లలతో చేసే ట్రిక్కుల్లో మచ్చుకు ఒకటి ఈ వారం చూద్దాం.

మూడు అగ్గిపుల్లలను గమ్‌తో అంటించకుండానే మరో అగ్గిపుల్లసాయంతో గాలిలోకి ఎత్తగలనని మీరు మీ స్నేహితులతో సవాల్ చేయండి. ఎవరైనా చేయగలమని అంటే చేసి చూపించమని అడగండి. ఇది సాధ్యమే అయినా ఇందులో గల ట్రిక్ ఏమిటో తెలునుకోకపోతే ఎవరూ చేయలేరు. మూడు అగ్గిపుల్లలను గమ్‌తో అంటించకుండా పైకి ఎలా ఎత్తగలమో ఇప్పుడు చూద్దాం.



మూడు అగ్గిపుల్లలను పటంలో చూపినట్లుగా త్రిభుజాకారంలో అమర్చండి. వాటి కొనల ఉండే మందును మరో అగ్గిపుల్లతో అంటించండి. అప్పుడు అవికాలిపోయి అతుక్కుపోతాయి. ఆ తరువాత మీరు మరో పుల్ల సాయంతో వాటిని తేలికగా గాలిలోకి లేసవచ్చు.

'విలువైన పలుకులు'

విద్యార్థి చదివే నిజమైన పాఠ్యపుస్తకం అతని ఉపాధ్యాయుడు-**గాంధీజీ**

పెదవులు చెప్పే మాటల కంటే కళ్ళు చెప్పే మాటలకు శక్తి ఎక్కువ-**టకర్‌మాన్**

పొగడ్త అనేది పన్నీరు వంటిది. దానిని వాసన చూసి వదిలేయాలి కానీ తాగుతూ కూర్చోకూడదు-**జాన్ బెల్లింగ్స్**

-సేకరణ : ఎ. గీతాదేవి, కాకినాడ.

వై. జగదీశ్వరి, 10వ తరగతి
ఎస్‌వియస్ నికేతన్, చినకాకాని



ఎ. గోపాల్, 8వతరగతి
పాలవలస, బారువా, శ్రీకాకుళం జిల్లా

జి. రామకృష్ణ,
10వ తరగతి
జడ్‌పి హెచ్‌ఎస్,
రఘుపతి పేట,
కల్వకుర్తి,
మహబూబ్ నగర్ జిల్లా



వి. నవీన్ కుమార్, 4వతరగతి
పూలిసుబ్బయ్య మెమోరియల్ స్కూల్, మార్కాపురం

'అంకెల వింత'

నేస్తాలూ, ఈ వారం '9'తో చేయగలిగిన ఒక అంకెల ప్రయోగం గురించి తెలుసుకుందాం. మీ ఇష్టం ఉన్న సంఖ్య తీసుకోండి. వాటిలో అంకెల స్థానాలు మార్చి పెద్ద సంఖ్య నుండి చిన్న సంఖ్యను తీసివేయాలి. ఫలితం ఎప్పుడూ '9'చే భాగించబడుతుంది.

సరిచూడండి : (1) సంఖ్య = 47

అంకెల స్థానాలు మార్చితే 74 అవుతుంది.

పెద్ద సంఖ్య నుండి చిన్న సంఖ్యను తీసివేయగా

74–47= 27.

ఇది '9'చే భాగించబడుతుంది.

9×3=27.

(2) సంఖ్య = 437

అంకెల స్థానాలు మార్చితే 374 అవుతుంది.

437–374= 63.

ఇది '9' చే భాగించబడుతుంది. 9×7=63.

మీరు కూడా ఇలాంటివి పంపి మన నేస్తాలందరికీ తెలియచేయండి.

-కుంజా సంతోష్ కుమార్, 9వ తరగతి ఎల్.ఎఫ్.కాన్వెంట్, భద్రాచలం, ఖమ్మం జిల్లా

మాటలకోట - 28

1			✿	2		3	✿	4	5
	✿	✿	6		✿	7		✿	
8	9		✿	✿	10		✿	✿	
✿		✿	11		✿	✿	12	13	
14	✿	15	✿	✿	16		✿		✿
	✿	17		18	✿	✿	19		20
21		✿	✿	22		23	✿	✿	
	✿	✿	24	✿	✿	25		26	
✿	27			✿	28	✿	✿		✿
29		✿	30		✿	31			✿

అడ్డం

1. మొదటి తిథి (3)
2. ఆకాశం (3)
4. ధూమం (2)
6. మేడ, అంతస్థు (2)
7. ట్రైలరు (2)
8. ఈ వనంలో తులసి మొక్క అని అంటుంటారు (3)
10. డబ్బు (2)
11. ఆభరణం (2)
12. పూర్ణం లోపించిన ప్రమాదం (3)
16. దర్పణం (2)
17. పిల్లల పట్ల దీనిని అతిగా చూపటం మంచిది కాదు (3)
19. పెన్నుతో (3)
21. పరుగు (2)
22. చివర్లో సాగిన కలప (3)
25. పాలించేవారు (4)
27. మునుగుట (3)
28. సముద్రం (1)
29. ఇందులో టీ తాగుతారు (2)
30. బురద (2)
31. మన రాష్ట్రంలోని ఓ విహార స్థలం (3)

నిలువు

1. పక్షి (3)
2. కుర్చీ (2)
3. ఎటు చదివినా ఒకటే (3)
5. సరిగమపదనిస.... 3, 4, 5, 6 (4)
9. ఒక చెట్టు (2)
13. పిల్లి (3)
14. 'సఖి' దర్శకుడు... (4)
15. కోటలో ఇది వేయడం.. (2)
18. జిగురు (2)
20. తోక, ఇంకో తోక, మరో తోక.. ఇవేమిటి? (3)
23. పాపను పిలవండి.. (2)
24. అడ్డం 30 లోంచి పుట్టి, తిరగబడింది (3)
26. స్వల్పకాలిక నిద్ర (3)
27. ఆపద, ప్రమాదం (2)

గత వారం జవాబులు

మాటలకోట-27

అడ్డం : 1.గుర్రం 2. సులోచనం 5. పది 10. ఉంగరం 11. కలుగు 15. కాదు 17. గురుదు 19. కృఇల్లు 21. సర్పయాగం 24. గారె 26. దూరం 27. నిబంధన 28. ఆదా 29. గజం 30. దిక్కు

నిలువు : 1.గుక్క 3. లోభి 6. దినం 7. దొంగరాముడు 9. కలుపుమొక్క 12. పొరుగు 13. టీకా 14. ముచ్చట్లు 16. దునియా 18. రుణం 20. ఇల్లు 22. గంగానది 23. మైదానం 25. ఓదార్పు 27. నిజం

పస్తు-మస్తిమస్తి! ఆకలి రాజకీయం!

రుక్మిణి

వాజ్‌పేయి గారంటే మజాకా కాదు. అబ్బో ఆయన రాజకీయమే వేరు! ఎట్లాంటి సంగతుల్నయినా అరటి తొక్క వూడబీకినట్లు... కొనగోటికూడా గుచ్చుకోకుండా... అతి సుతిమెత్తంగా మాట్లాడ్డంలో ఆయనకు ఆయనే సాటి! కర్రలు విరక్కుండా.. పాములు అసలే నీలక్కుండా సన్నాయి నొక్కులు నొక్కుతూ నగిషీల కవిత్వం కమ్మగా చెప్పి ఒప్పించే ప్రయత్నం చేయగలడు - 'బహుముఖ' చతురుడు కాబట్టి ఎన్ని ముసుగులైనా ధరించి, ఎన్ని కంగాళీ కుప్పిగంతులైనా వేసి ఆట రక్తికట్టించగలడు - అదుగో... అదే! ఆయనగారి బహిరంగ సభ జరుగుతుందాయె! మైదానం నిండా జనం పికపికలాడి పోతున్నారు - ఇసకవేస్తే రాలటం లేదు. అసలు సంగతేమిటంటే చాలా చోట్ల 'సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన' పథకం అవి విపరీతంగా ప్రచారం చేసి పారేయడం వల్ల అట్లా జనం తొండతొక్కిడిగా... అబగా దొరకబుచ్చుకుని ఏవేవో వరాల జల్లులు కురిపించక పోతాడా... వానలు కురవకున్నా ఈ 'జల్లు' తాలూకు ఒక్క చుక్కైనా తమ బక్కచిక్కిన వంటిమీద పడకపోతుందా అనే ఆరాటం మరో వేపు - అందుకే పేదజనం విరగబడిపోతున్నారు!

ప్రహరీగోడ మీద ఇరుగ్గా ముర్గిగ్గా యాద్గిరీ, మల్లేశాలు చెవులు దొప్పల్లా రిక్కరించి వింటున్నారు గదా! ఏ గోడా ఆధరవూ దొరకని శాల్తీ ఓటి ప్రక్కనున్న చెట్టుకొమ్మ మీద ఓ కొమ్మను కాళ్ళ సందున ఇరికించుకుని ఆ చీకట్లోనే యాద్గిరి భుజాల వరకూ వేలాడుతూ కంపుగొడుతున్నాడు - వాడి ఒంటిమీద ఏమీ లేకున్నా చర్మం మాత్రం బాగానే వేలాడుతుంది. కట్టుకున్న మాసిన పంచె చీలికలు వాలికల్లై మోకాళ్ళు దాటి పేగుల్లా వేలాడుతుంటే మల్లేశం మటమటలాడుతూ ఆ 'చీకిరి గోచోడి' వంక చీదరగా చూశాడు.

"కాబట్టి భారత ప్రజలారా! మన దేశ గౌరవాన్ని - ప్రతిష్టను కాపాడడం.. పరువును నిలపడం మనధర్మం! భరతమాత ముద్దుబిడ్డలం మనం! దేశంలో కరువు విలయతాండవం చేసి జనాలు ఆకలి చావులు చస్తున్నారనడం శుద్ధ అబద్ధం! అదంతా రాజకీయ ఆకలి చావుల - దౌర్భాగ్య రాజకీయ కుట్ర... ఎత్తుగడ... దగా...".

కొమ్మమీద పసందుగా 'చీకిరిగోచోడు' పైకీ కిందికి ఊయలలూడుతూ "కరక్టు..! అబ్బో..! ఏం చెప్పినాడు గురూ!" అని లపలప చంకలు చరుచుకున్నాడు.

"అట్లాంటి పుకార్ల వలన మన దేశమాత పరువు గంగలో కలుస్తుంది - అందులోనూ ఇపుడు మొత్తం ప్రపంచంలో.... కాశ్మీర్లో-ఉగ్రవాదం విలయతాండవం చేస్తుంది. తాలిబన్లు.. లష్కర్లు... ముష్కర్లు.. అల్‌కిదాలు మహోన్నతమైన 'మన' అమెరికా మీదనే దాడి చేసి... వ్యాపార కేంద్రాన్నీ.. రక్షణ కేంద్రాన్నీ విమానాలతో... బాంబులతో ఢీకొట్టి.. అయ్యో నా అమెరికా... ఆ...

వాజ్‌పేయిగారు ఉద్వేగాన్ని నిలువరించుకోలేక దుఃఖభారంతో అలాగే కుప్పకూలిపోతారేమోనని అస్మదీయులంతా ఆరాటపడిపోయారు. ఆయనగారే దెబ్బతిన్న మోకాలి చిప్పల్ని కూడదీసుకుని మళ్ళా "అందుకే అమెరికా ఆపద మనందరి ఆపద... వాళ్ళ కోసం మన ధనమాన ప్రాణాల్నయినా అర్పించాలి... ఈ ఉగ్రవాదుల్ని తరిమి వేయాలి.. దాని కోసం మనమంతా ఏ రకమైన... ఎట్లా ఏ ధరలు పెరిగినా ఓర్చుకోవాలి.. పన్నుల పోటు పడినా తట్టుకోవాలి... ఏపీ ఛార్జీలు పెరిగినా అదంతా మన అమెరికాను రక్షించడానికే... ఉగ్రవాదాన్ని అంతం చేయడానికే...!"

"ఓ అయిదారు వేల మంది సచ్చిపోయింగ్రు పాపం! వాళ్ళందరి కోసం మనం ఏం చేసినా తప్పులేదు.. ఎంత చేసినా ఎక్కువ కాదు!" చీకిరిగోచోడు రెచ్చిపోయి యమా ఉద్రేకపడిపోతున్నాడు. కొమ్మ మీద తాపీగా వూగుతున్నాడు.

"అరె యాద్గిరీ... మన దేశంలో అయిదారొందల మంది గంజికూడ దొరక్క నిక్కి నీలిగితే ఆకలి చావులే లేదంటాడేందిరా?..

"వానలే కురవకపాయె! మన రాష్ట్రంలోనే 160 మంది ఆకలికి చచ్చిరి. పాతిక లక్షల ఎకరాల భూములు బీడుబడిపాయె! కె.సి.కెనాల్‌కు నీరివ్వరట... గత 40 సంవత్సరాల్లో ఇట్లాంటిది ఎక్కడా చూడ్లేదని అనుభవశాలులంటున్నారు?"

"అయ్యో... మన ఆంధ్రప్రదేశ్‌లో వానలు సంపూర్ణంగా పడ్డాయి... చెరువులు, కుంటలు పోటీలు పడి నిండిపొంగిపోర్లుతున్నాయి.. సేద్యం బ్రెమ్మాండం.. కరువు సాయం. అవసరమే లేదని ఒక పక్క కేంద్రం నుండి వచ్చిన కరువు విపత్తు సంఘపోల్లు నివేదికల్ని ఈ ప్రధాని 'గారి'కే అందిచ్చినారు గదా!"

యాద్గిరికి ఉడ్చి వాని తాటిపీచులాంటి తలమీద ఒకటిద్దామనిపించింది!

"కాబట్టి ప్రజలారా... కరువును రాజకీయం చేయకండి! దేశంలో ఎక్కడా ఆకలి చావులు లేవంటే లేవూ.. లేవు! ఎక్కడో ఒరిస్సా రాష్ట్రంలో ఎవడో మావిడిటెంకల రసం తాగారని ప్రచారం చేస్తున్నారు - ఎంత అప్రదిష్ట.. ఎక్కడో గుడిసెలో ఆకలికి కుటుంబం నిక్కి నీలిగిందనే నీలి వార్తలు... తీరా పోయిచూస్తే అంతా అబద్ధం.. ఆ ఇంటి నిండా ఆహార ధాన్యాలున్నాయి- వాళ్ళకు బ్యాంకు అకౌంటూ దాన్లో ఎమౌంటూ వుంది - హో... మన భారతమాత పరువు ఇట్లా కొన్ని రాజకీయ పార్టీలు వాళ్ళ అక్కసు కొద్దీ బజారుకీడుస్తున్నారు!"

"అంతే.. అంతే...!" చీకిరిగోచోడు లొటికెలు వేశాడు. మల్లేసు ముందస్తుగా వాడి డొక్కలో ఓ గుద్దు గుద్దుదామనుకుని తమాయించుకున్నాడు.

"దేశ స్వాతంత్ర్యదినోత్సవం నాడు... పూజ్య దీన్‌దయాల్ జన్మదివసన సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన'.. యోజనాల దూరం ఈ ఆకలిని తరిమికొట్టడానికి 10 వేల కోట్లతో ప్రణాళిక... అబ్బో.. ఆకలుండదు.. చావులుండవు.. చింతపిక్కల చీకాకులుండవు. అసలు ఆకలితో నిద్దర్లు పోయే అవసరవే వుండకుండా చేస్తున్నాను!"

"అరె... మన చెంద్రబాబుగారేమో తాను నిద్దరపోను... మరెవడ్నీ నిద్దర పోనీయనని గాండ్రిస్తాడూ... వాజ్‌పేయిగారేమో ఆకల్తో ఎవ్వడూ నిద్దరపోవద్దంటాడూ... అరె... ఈ నిద్దర చీకాకు మతలబేందో అర్ధం కాదు...!"

"అబ్బే... ఆకల్ని తరిమేస్తానంటున్నాడు గదా... అసలు ఆకలిచావులే ఏ రాష్ట్రంలో దేశంలో లేవని చెబుతుంటే వినిపిచ్చుకోరేం? మొత్తం జనాలకు ఆకలి తీరిపోతుందీ.. ఆకల్తో ఎవడూ చావడం లేదని చెబుతున్నాడు... అదుగో... ఆయనగారు 'ఆకలి' మీద కమ్మని కవిత్వం కూడా ఎంతమధురంగా చెపుతున్నాడో... వినండెస్సె!" చీకిరి గోచోడు రెచ్చిపోయి ఎండిన రొమ్ము బాదుకుంటూ చీదరించడంతో యాద్గిరి మల్లేశాలు అదిరిపోయారు.

"మన అమెరికా అగ్ని గుండంలో చిక్కుకుని ఉడికి పోతుంటే మన భారతమాత గుండెలవిసిపోతున్నాయి. ఈ రాజకీయాల్ని.. ఉగ్రవాదుల్ని ప్రపంచపటం మీద లేకుండా చేయడానికి మన అమెరికా వారితో ఎన్నో ఒప్పందాలు చేసుకుంటున్నాం! గిట్టని వాళ్లేమో రాజకీయం చేసి పారేస్తున్నారు. దుర్మార్గపు ప్రచారాలు చేస్తున్నారు. మన గిడ్డంగుల్లో పుష్కలంగా ధాన్యాలు పేరుకుని వున్నాయి - 'పనికి ఆహారం' అందిస్తున్నాం! మీరెవరూ ఈ రాజకీయాల గాలానికి చిక్కకండి! తప్పుడు రిపోర్టులు చదవకండి! ఆకలిచావులు అబద్ధం...! మా పరిశోధనల్లో తేలిన అంశం అది... జనాల ఇండ్ల నిండా బియ్యం నిల్వలూ, బ్యాంకు ఎకౌంట్లూ వున్నాయి. కాలం కలిసిరాక జనం అట్లా చస్తారని, వందేండ్లకు ముందే మన 'జ్యోతిషశాస్త్రజ్ఞులు' వెల్లడించారు. మన 'వేదగణితం' కూడా లెక్కలు గట్టిమరీ చెప్పింది.

"ఒరె.. మన ప్రధానిగారు అంతగానం చెప్తుంటే ఇంగ మరిమనకు ఆకలి గీకలి ఎట్లా అవుతుందిరా...!" యాద్గిరి దిగులుగానే అన్నాడు.

"అవున్రా" జ్యోతిష్యం... వాస్తు... పస్తు... వేదాలు... గణితం అంటున్నాడాయె!" మల్లేశు మరీ కృంగిపోతూ అన్నాడు.

"డబ్ల్యుటీవో యమాడేంజరు - దానితో మనం కలబడి మన పంటల్ని ప్రపంచ మార్కెట్లో అమ్ముకోవాలె! అందుకే రైతన్నలందరూ పంటలు బంద్ చేసి పండ్లతోటలు పంపించారె... పుల్లగూరకన్నా పూలతోటలే మెరుగు... కమ్మని పూలకు మంచి గిరాకీ... పోటీపడి అమ్ముకోవచ్చు... ముందు మీకు పూలమీద ఓ కమ్మని కమనీయ కవిత్వం చెబుతాను!"

యాద్గిరీ మల్లేశులు తలలు పట్టుకున్నారు... రెండ్రోజుల్నుండీ తినడానికి ఏమీ లేక... పని చేయడానికి పనిలేక.. కడుపులో పేగులు హాహాకారాలు చేస్తున్నాయి.. పైగా ఈ చీకిరిగోచోడు చెవి ప్రక్కన చేరి "కరువు లేదు... ఆకలి లేదు.. అని ఆలాపన.. అక్కడేమో వాజ్‌పేయి గారు గోదాన్లు.. ఆరుకోట్ల టన్నుల బియ్యం డబ్ల్యుటీవో.. అమెరికా... ఉగ్రవాదం... అని ఊదర... ఇదెక్కడి పీకులాటరా దేవుడా!

... రామ్మా... రా.. రా...మనోల్లంతా మన మెహబూబు నగరోళ్ళే! మన తెలుగోళ్ళే... గోచోడు చీకట్లోకి చూస్తూ కేకలు పెడుతుంటే మల్లేశంకి మతిపోయి విస్తుపోయాడు.

"ఆ వాజ్‌పేయిగారి పరిశోధనలో ఇండ్లలో బియ్యం.. బ్యాంకుల ఎకౌంటుందని చెప్తున్నాడు గదా... గదిమా ఇల్లే.. గా బియ్యం.. డబ్బులు ఎక్కడివో కావు... మా అయిదేండ్ల పోరిని కరువుకు... ఆకలికి ఆగలేక అమ్ముకుందామని అడ్వాంసుగా తీసుకున్న డబ్బు! అబగా అవి తినబోయేసరికి లటుకుమని నేనూ మా ఆడదీ.. మా పోరీ ఆకలికి ఆగలేక మలమలమాడి చస్తిమాయె! "హహ్హహ్హా...!"

యాద్గిరి భయంతో హాహాకారాలు చేస్తూ గోడమీద నుండి దబ్బున విరుచుకుని కింద గోతిలో పడ్డాడు.

"కరువు లేదు.. కేంద్ర ప్రభుత్వం లేదు... బియ్యం లేవు... పనుల్లేవు.. పథకాలు లేవు... పాటలు లేవు.... పదవే రంగమ్మా...!" చీకరి గోచోడు చీకట్లో బిడ్డ చెయ్యందుకుని చేతులూగిలాడించుకుంటూ ఆ కటిక చీకట్లో ఆకాశంలోకి ఎగిరిపోయాడు!

మల్లేశు మతిపోయి - బిక్కచచ్చి బేలగా చూస్తుండి పోయాడు! ☆

అద్భుతక్షేత్రం భైరవకోన

ఎ.సువర్ణరాజు



అపరూపసౌందర్యం భైవరకోన దృశ్యం

గలగలమంటూ సవ్వడిచేసే ఎత్తైన జలపాతాలు. నింగిని తాకే మహావృక్షాలు. పక్షులు కిలకిలారావాలతో సౌందర్యాన్నంతటిని తనలోనే ఇముడ్చుకుని పర్యాటకులను ఆకట్టుకునే అద్భుత క్షేత్రం భైరవకోన.

నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులో తూర్పు కనుమలకు కొద్ది దూరంలో సి.ఎస్.పురం మండలంలోని అంబవరం కొత్తపల్లె గ్రామానికి సమీపంలో ఈసుందరక్షేత్రం వుంది. ఈప్రాంతంలో ఎక్కడ చూసినా కోనేరులు, శివలింగాలు దర్శనమిస్తాయి. భైరవకోనలో మొత్తం ఎనిమిది దేవాలయాలు వున్నాయి. ఈఎనిమిది దేవాలయాల్లో శివుడు ఎనిమిది రూపాలుగా వున్నట్లు ప్రతీక. ఈక్షేత్రంలో ఒకప్పుడు కోటిలింగాలు వున్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఇక్కడ దుర్గాదేవి ఆలయానికి మూడడుగుల దిగువన ఏడది పొడవునా ప్రవహించే సెలయేరు సుందర మనోహరంగా వుంటుంది. క్షేత్రాన్ని పాలించిన కాలభైరవుని పేరున భైరవకోనగా వ్యవహరిస్తున్నారు. క్షేత్రానికి ఉత్తర వైపుగా కొండమీద పెద్దపెద్ద రాళ్ళలో అభేద్యమైన ఆనాటి రాజుల కోట నిర్మితమై వుంది. కోట లోపల నుండే శత్రువుల ఉనికిని కనిపెట్టేందుకు వీలుగా కోట గోడకు అక్కడక్కడా రాళ్లకు రంధ్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈకోట గోడలు శిథిలావస్థలో వున్నాయి. నాటి రాజులకు చిహ్నంగా జండా వుంచే ప్రదేశాన్ని నేడు జంగాబోడుగా వ్యహరిస్తున్నారు. ఇది చాలా ఎత్తైన ప్రదేశంలో వుంది. కోటలోని రాజుల ప్రాకారాల వద్ద ఒక పెద్ద రహస్య సొరంగ మార్గం వుంది. అత్యవసర పరిస్థితుల్లో శత్రువుల నుండి కాపాడుకునేందుకు ఈ మార్గాన్ని ఉపయోగించే వారని చెబుతారు. ఈమార్గం పాటూరు మండలం అనుమనిగిరి వరకు వున్నట్లు చెబుతారు. దీనిని కానందానికంతగా చరిత్రకారులు వ్యవహరిస్తారు. రాజులు పోయారు. రాజ్యాలుపోయాయి. కాని ఆనాటి రాచరికానికి తీపిగుర్తుగా అవశేషాలు మాత్రం శిథిలమై దర్శనమిస్తున్నాయి. దక్షిణవైపున వున్న కొండ శిఖరంపై పంచలింగాల ఘట్టం అనే విశాలమైన ప్రదేశం వుంది. ఇచట పరశురాముడు యజ్ఞం చేశాడని చెబుతారు.

క్షేత్రానికి తూర్పువైపు లోతట్టు ప్రాంతంలో కొండశిఖరం పై నుండి జలపాతం ఏడాదిపాటు ప్రవహిస్తూ పర్యాటకులను ఆహ్లాదపరుస్తుంది. కొండపై భాగాన త్రివేణిసంగమం, చిత్రకూటం అనే నరసన్నులున్నాయి. ఈసరస్సులనుండే జలపాతం ద్వారా నీరు ప్రవహిస్తుందని భావిస్తారు. జలపాతం చూపరులను కదలనీయదంటే ఏమాత్రం అతిశయోక్తికాదు. నరసింహగుహ, లక్ష్మీగుహల మధ్య దొన (చెలం)వుంది. ఈదొన నుండి ఎంత నీరు వెలికితీస్తే అంతనీరు చెలంలోకి చేరుతుంది. ఇది చాలా అద్భుతమైన దృశ్యంగా యాత్రికులు భావిస్తారు. కొండల మధ్య పలురకాలచెట్లు అల్లుకుని పెద్దలోయ వుంటుంది. దీనిని పెద్దకావుగా వ్యహరిస్తారు. ఇక్కడి సెలయేటి నీరు చెట్లమొదళ్ళ నుంచి వివిధ రకాల తీగల(చెట్ల) నుంచి కారే పాయలతో కలిసి క్షేత్రంలోకి ప్రవహిస్తున్నందున ఈనీటిలో స్నానం చేస్తే అంటువ్యాధులు నయమవుతాయని భావిస్తారు. ఇక్కడి శిల్పాలకు, మహాబలిపురంలోని శిల్పాలకు పోలికలు వున్నాయని, అందువలన పల్లవ చోళుల కాలంలో క్షేత్రం నిర్మించినట్లు ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు పేర్కొన్నారు. ఇన్ని అద్భుత సౌందర్యాలను వరికించాలంటే రవాణా సౌకర్యాలు నామమాత్రంగానే వున్నాయి. సి.ఎస్.పురం నుండి వి.బైలు బస్ ఎక్కి అంబవరం కొత్తపల్లి వద్ద దిగి నడిచిపోవలసి వుంటుంది. నిత్యం రద్దీగా వుండే పర్యాటక కేంద్రం అభివృద్ధికి ఆమడ దూరంలో వుంది. పర్యాటకులు విడిది చేసేందుకు ఏమాత్రం వసతులు లేవు. కనీసం విశ్రాంతి తీసుకునేందుకు గాని, అల్పాహారం చేసేందుకైనా చిన్నపాటి దుకాణాలు లేవు. పలు అసాంఘిక కార్యక్రమాలకు నెలవై వున్నట్లు పత్రికలు ఘోషిస్తున్నా అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు. నేతలు దీని అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా పరిఢవిల్లు తుందనడంలో సందేహంలేదు. ☆



ఒకే రాతిపై చెక్కిన గుహాలయాలు

బీమాతోనే క్రీడాకారులకు భద్రత

మారేపల్లి లక్ష్మణ్

గాయలతో క్రీడాకారుల క్రీడా భవిష్యత్తు మసకబారడంతో పాటు భవిష్యత్తు అంధకారంగా మారుతున్నా వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం నుండి గానీ, శాప్ నుండి గానీ ఏలాంటి దీర్ఘకాల ప్రణాళికలు లేకపోవడం, బీమా సౌకర్యం సైతం కల్పించకపోవడం వారిని నిరుత్సాహానికి గురుచేస్తున్నాయి. గాయాల పాలైనపుడు వైద్య ఖర్చులను భరించడం, మృత్యు ఒడిలో చేరినపుడు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి చేతులు దులుపుకోవడంపై క్రీడాకారులు, తల్లిదండ్రులు, కోచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హాకీ క్రీడాకారిణి తీవ్రగాయానికి లోను కావడం, హైదరాబాద్‌లో జరిగిన సబ్ జూనియర్ ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్‌ను గెలుపొందిన వర్ధమాన జిమ్నాస్ట్ రమేష్, తూము కుంట ఎ.పి.స్పోర్ట్స్ స్కూల్ జిమ్నాస్ట్ విజయ్‌కుమార్ తీవ్రగాయాలకు లోను కావడం, జాతీయ క్రీడల్లో పతకం తేగలవాడిగా పరిగణించిన పరుశురాం ప్రమాదపుటంచుల్లో నిలవడం, తాజాగా చెస్ భవిష్యత్ తారలు నేలకొరగడంతో క్రీడలనే భవిష్యత్తుగా మార్చుకున్న క్రీడాకారుల భద్రత, భవిష్యత్తుపై పలు ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. గోపీచంద్ లాంటి కొద్దిమంది మాత్రం గాయాలపాలై తమ ఆర్థిక పరిస్థితితో కొలుకోని నిలదొక్కుకుంటున్నా, చాలామంది క్రీడాకారుల భవిష్యత్తు గాయాల కారణంగా అంధకారంగా మారుతున్నది. క్రీడలను ఎంచుకున్న పాపానికి వారి కుటుంబాలకు కూడా భారంగా మారుతున్నారు. వీరిని ఆదుకోవడానికి ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం చేరడంలేదు. వివిధ కారణాలతో క్రీడాకారులు ఆస్పత్రి పాలవడం చూస్తుంటే రాష్ట్ర క్రీడాకారులకు బీమా ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా వుందని క్రీడాకారులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ఏదో చిన్న గాయాలవుతాయి, చికిత్స వ్యయాన్ని భరిస్తే చాలనే వైఖరిని ఇప్పటి వరకు శాప్ కనబరుస్తూ వస్తున్నది. అయితే ఆటగాళ్లకు ప్రమాదకర గాయాలయితే, పరిస్థితి ప్రాణాంతకంగా మారితే చికిత్స వ్యయమే భరిస్తే చాలదు. క్రీడాకారులకు సరైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించక వారి దుస్థితికి కారణమవుతున్న క్రీడాశాఖ ఆటగాళ్ల కుటుంబాలకు నష్టపరిహారాన్ని కూడా చెల్లించాలి.



మొయినుద్దౌలా గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలైన హైదరాబాద్ వర్ధమాన క్రీడాకారుడు కౌశిక్

1994లో ఎ.శ్రీధర్‌రెడ్డి, ఆ తరువాత పి.ఆర్.మోహన్ శాప్ చెర్మెన్‌లుగా కొనసాగిన సమయంలో బీమా సౌకర్యాన్ని కల్పించే చర్య వచ్చినా కీలకమైన ఈ అంశాన్ని ఆ తరువాతి కాలంలో శాప్ కానీ, క్రీడా మంత్రిత్వశాఖ కానీ పట్టించుకోకపోవడం విచారకరం. ఇప్పటికైనా క్రీడాకారులకు బీమాను కల్పించడానికి శాప్ దృష్టి సారించాలి. ☆

బీమాపై పలువురి అభిప్రాయాలు

జాతీయ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ బీమా కల్పించాలి. ఏ ప్రమాదమైనా ముందు చెప్పి రాదు. ప్రమాదం జరిగాక తీసుకునే చర్యల కంటే ముందే ఇలాంటివి కల్పిస్తే కెరీర్ నష్టపోయే పరిస్థితులు ఉత్పన్నమయ్యే పక్షంలో క్రీడాకారులకు ఎంతో ఉపయుక్తంగా వుంటుంది-బాలరాజ్(రాష్ట్ర జిమ్నాస్టిక్స్ సంఘం కార్యదర్శి)

కేవలం గాయాలే కాదు, మృత్యువు ఎదురైన సందర్భాలలోనూ బీమా వున్నట్టయితే క్రీడాకారులపై ఆధారపడిన వారికి సహాయ కారిగా వుంటుంది-సి.ఎస్.ప్రదీపక్(అర్జున అవార్డీ)

విదేశాలలో ఫుట్‌బాల్ క్రీడాకారుల కాళ్లకు, టెన్నిస్ క్రీడాకారుల చేతులకు సైతం ప్రత్యేక బీమా చేస్తున్న ఈ రోజుల్లో గాయాలపాలై కెరీర్‌ను నష్టపోతున్న మన రాష్ట్ర క్రీడాకారులకు ప్రమాద బీమా ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది-పి.ఆర్.మోహన్(శాప్ మాజీ చైర్మన్)

వ్యక్తిగత బీమా అయినా, గ్రూప్ బీమా అయినా సరే రాష్ట్ర జట్ల శిక్షణ శిబిరాలకు తప్పని సరిగా వర్తింపచేయాలి. కేవలం సాధన సందర్భంగా గాయలపాలైన నల్గొండ క్రీడాకారిణి, జిమ్నాస్టిక్స్ క్రీడాకారులు, టోర్నీకి వెళుతూ మృత్యువాత పడ్డ చెస్ క్రీడాకారుల ఉదంతం తరువాత ఇప్పటికైనా ప్రభుత్వం బీమా ప్రవేశపెట్టాలి-జి.సత్యనారాయణ(హైదరాబాద్ హాకీ అసోసియేషన్ కార్యదర్శి)

ఉచిత బీమా అన్ని రకాల గాయాలను కవర్ చేస్తుంది. కనీస ప్రీమియంతో గరిష్ట ప్రయోజనాన్ని పొందే అవకాశం వుంటుంది. ఇంకా ఆటగాళ్లకు గాయాల నుండే కాకుండా జీవితానికి భద్రత వుంటుంది-ఆరిఫ్.(భారత బ్యాడ్మింటన్ కోచ్)

టీమ్ ఈవెంట్లలో పాల్గొనే రాష్ట్ర జట్లకు గ్రూపు ఇన్సూరెన్సు వుండాలి. జీవితాంతం క్రీడారంగానికి దూరమయ్యే పరిస్థితి ఉత్పన్నమైతే ఉద్యోగ అవకాశాలను కల్పించాలి. అనారోగ్యంతో క్రీడలకు దూరమైతే వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలి- వినయ్ (బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు)

క్రీడాకారులు మహాఅయితే 10, 15 సంవత్సరాలు ఉచ్ఛదశలో వెలుగొందుతారు. అయితే గాయాల కారణంగా క్రీడలకు దూరమైతే క్రీడాకారుల పరిస్థితి పూర్తిగా దిగజారుతుంది. అందుకే క్రీడాకారులకు బీమా సౌకర్యాన్ని కల్పించాలి. భారత క్రీడా ప్రాదికార సంస్థ(సాయ్) తరహాలో రాష్ట్ర క్రీడా ప్రాదికార సంస్థ(శాప్) క్రీడాకారులకు జీవిత బీమా కల్పించే అవకాశాన్ని పరిశీలించాలి-ప్రభాకర్(సాయ్ కోచ్) ☆

మిస్సింగ్ యూ

అత్తలూరి విజయలక్ష్మి

గవర్నమెంటు జీపు ఆ పెద్ద గేటు ముందు ఆగింది -- పవిత్ర జీపు దిగి డ్రైవర్‌తో అన్నది "ఉదయం ఎనిమిదిన్నరకి రా'

డ్రైవర్ 'ఓకే మేడమ్' అన్నాడు.

వాచ్‌మెన్ గేటు తీశాడు-- "అప్పుడే గేటేశాడేంటీ?" పవిత్ర చేతి వాచీ చూసుకుంది -- పదవుతోంది కీర్తి ఏం చేస్తోందో!

కీర్తి గుర్తుకు రాగానే పవిత్ర నడకలో వేగం పెరిగింది -- లిఫ్టు పని చేయడం లేదన్న సంగతి మర్చిపోయి అక్కడి దాకా వెళ్లి-- మళ్లీ గుర్తొచ్చి మెట్ల మీదుగా రెండో అంతస్తులో వున్న తన ఫ్లాటు దగ్గరకి నడిచి, బ్యాగులోంచి డూప్లికేటు తాళం తీసి లోపలికి నడిచింది --

హాల్లో లైటు వెలుగుతోంది... డైనింగు టేబుల్ మీద ఆహార పదార్థాలన్నీ ఎవరూ కదిలించలేదన్నట్టు ఎక్కడివక్కడ పెట్టి వున్నాయి -- బెట్‌రూము వైపు నడిచింది -- మంచంమీద కీర్తి అడ్డదిడ్డంగా పడుకుని ఉంది -- ఆ పిల్ల తల దగ్గర పుస్తకాలు, మంచంమీద విసురుగా పడేసినట్టు పెన్ను, పెన్సిలు, రబ్బరు పడి వున్నాయి.

పవిత్ర మంచం దగ్గరగా నడిచి, కీర్తి జుట్టు సవరించి మృదువుగా పిలిచింది "కీర్తీ!"

కీర్తి పలకలేదు. కదలలేదు గాఢంగా నిద్రపోతున్నట్టు ఉఛ్వాస నిశ్వాసలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

పది కూడా కాకుండా అప్పుడే నిద్రేంటి? హోంవర్కు పూర్తి చేసిందో, లేదో, స్కూలు యూనిఫారం కూడా మార్చుకోలేదు-- విసుగ్గా కూతురి వైపు చూసిన పవిత్ర ఉలిక్కి పడింది.

కీర్తి చెంపల మీద కన్నీటి చారికలు, ఆమె హృదయం ద్రవించి పోయింది..

తనకీరోజు ఆఫీసులో బాగా లేట్ అయింది-- ఈ మధ్య దాదాపు నాలుగైదు నెలల నుంచీ రోజూ తొమ్మిది, పది అవుతోంది - మామూలుగానే ఏడు దాటుతుంది -- ఈ మధ్య మరీ ఆలస్యం అవుతోంది-- వదిలించుకుని రావడానికి తను క్లర్కు కాదు. బాధ్యత గల ఆఫీసరు -- మీటింగులని, సిఎంతో వీడియో కాన్ఫరెన్సు అనీ, ఇన్‌స్పెక్షన్, మంత్రిగారితో ముఖాముఖీ అని ఏవో ఒక ఎంగేజ్‌మెంట్సు -- ఆఫీసరుగా బాధ్యతలు మోయడంలో తల్లిగా, ఇల్లాలిగా కొన్ని బాధ్యతల్ని విస్మరించాల్సి వస్తోంది -- కానీ తప్పదు--

దానికి తోడు విజయ్‌కి పూనా ట్రాన్స్‌ఫర్ అయింది-- లేకపోతే కనీసం తను ఆలస్యంగా వస్తే విజయ్ కీర్తి బాధ్యత తీసుకునేవాడు, ఇప్పుడు-- ఉత్తరాలు రాయడానికి కూడా ఆ దొరగారికి టైములేదట -- పవిత్ర నిట్టూర్చింది. అయినా కీర్తి ఈ మధ్య మరీ పొసెసివ్‌గా మారింది - అస్తమానం అమ్మ, అమ్మ. ఎలా కుదురుతుంది తనకి అనుక్షణం అంటిపెట్టుకు కూర్చోడానికి! కొన్ని సుఖాలు కావాలంటే కొన్ని కష్టాలు అనుభవించాలి, కొన్ని కంఫర్ట్సు కావాలంటే కొంత త్యాగం తప్పనిసరి, ఇదేగా జీవితం అంటే, భర్తనీ, పిల్లలనీ, ఇంటినీ చూసుకుంటూ కూర్చోవాలంటే, ఉద్యోగం మానేయాలి -- కానీ ఉద్యోగం చేయకపోతే ఎలా?

తను కష్టపడి సర్వీసు కమిషన్ పరీక్షలు పాసై సంపాదించిన ఆఫీసరు పోస్టు... చిన్నప్పట్నించీ కన్న కల... చిన్నప్పుడు గెజిటెడ్ ఆఫీసరు సంతకం కోసం ఎంతమంది ఆఫీసర్ల చుట్టూ తిరిగిందో తనకి తెలుసు... ఒక్కోళ్లు ఎంత ఫోజు కొట్టేవాళ్లో.. కొందరు సంతకానికింత అని రేట్లు పెట్టేవాళ్లు.. తండ్రి ప్రైవేటు ఉద్యోగి... ఆ చిరుద్యోగికి పెద్దవాళ్ళతో పరిచయాలు లేకపోవడంతో తనూ, అన్నయ్యా కలిసి వాళ్లని బతిమాలి, వాళ్ల అనుమానపు చూపులు తట్టుకుని, సంతకాలు తీసుకొచ్చేవాళ్లు... ఇప్పుడంటే జిరాక్స్ కాపీలు వచ్చాయి గానీ అప్పుడు డూప్లికేటు టైపు చేయించి దానిమీద గెజిటెడ్ ఆఫీసరు సంతకం చేయించి సబ్‌మిట్ చేయాల్సి వచ్చేది సర్టిఫికెట్లు. పవిత్ర నిట్టూర్చింది. ఆ అనుభవమే తన మనసులో తానెలాగైనా గెజిటెడ్ ఆఫీసరు కావాలన్న కోరికకు బీజం వేసింది.

ఇంత కష్టపడింది ఉద్యోగం చేయకుండా ఇంట్లో కూర్చోడానికి కాదే! అయినా చేతనైనంత మటుక్కి కీర్తికి ఏ లోటూ లేకుండా చూసుకోడానికి ప్రయత్నిస్తోంది. దానికోసం ఇంట్లో అన్ని రకాల ఎంటర్‌టైన్‌మెంట్ మెటీరియల్ తెప్పించింది-- వీడియోగేమ్స్, టి.వి., కామిక్స్ పుస్తకాలు, కంప్యూటరు, ఇది లేదు అని లేకుండా అన్నీ అమర్చింది. ఆకలేస్తే తినడానికి ఇంటినిండా స్వీట్సు, పండ్లు, బిస్కట్లు, క్యాడ్‌బరీ చాక్లెట్లు-- స్కూలు నుంచి రాగానే హాయిగా యూనిఫామ్ మార్చుకుని, కాళ్లు, చేతులూ కడుక్కొని ఏ పళ్ళో, బిస్కెట్లో తిని కూర్చుని హోంవర్కు పూర్తి చేసి, ఏ వీడియోగేమ్సో ఆడుకోవచ్చుగా-- "నువ్వు తొందరగా రా మమ్మీ, నాకు బోరు కొడుతోంది" అని తప్ప మరో మాట ఉండదు. ఈ వెధవ సెల్‌ఫోను ఎందుకు తీసుకుందో తను, ప్రతి అరగంటకీ ఫోను చేయడం "నువ్వు తొందరగా రా మమ్మీ" అనడం, మీటింగ్‌లో వున్నానని లేదు ఏం లేదు--

ఈ పిల్లకి మొండితనం ఎక్కువ అవుతోంది -- ఎనిమిదేళ్లు దాటుతున్నాయి -- ఇంకా చిన్న పిల్లలా చేస్తుంది -- విదేశాల్లో పిల్లలకు చిన్నప్పటి నుంచీ ఒకళ్ళమీద ఆధారపడకుండా ట్రైనింగ్ ఇస్తారుట-- ఈ రోజుల్లో ప్రతి స్త్రీ ఉద్యోగం చేస్తుంది-- ఇరవై నాలుగ్గంటలూ పిల్లల్ని కనిపెట్టుకుని ఎవరు కూర్చుంటున్నారు! అలాగని అస్తమానం ఉద్యోగం సంగతి మాత్రమే

చూసుకోవాలని ఎవరూ అనుకోరు కాబట్టి ఉన్న సమయంలోనే కుటుంబానికి కొంత సమయం కేటాయించడం జరుగుతోంది -- అంతేగానీ దీనికోసం తను ఉద్యోగం మానుకుని ఇంట్లో ఉండగలదా? అన్నం కూడా తినలేదు -- చిన్నపిల్లలా అమ్మ పెట్టాలి, నేను తినాలి అనుకోడం ఏవిటి? స్వంతంగా, ఎవరిమీదా ఆధారపడకుండా బతకడం ఇప్పటి నుంచే నేర్పాలి-- రేపట్నించీ డిసిప్లిన్డ్‌గా పెంచాలి -- బొత్తిగా డిసిప్లిన్ మర్చిపోతోంది.

పవిత్రకు కీర్తిమీద కోపం వచ్చింది -- పడుకోనీ లేపకూడదు. రోజూ తనొచ్చి బతిమాలి తినిపిస్తేగాని తినడం లేదు. వెధవ్వేషాలెక్కువైనాయి. ఒకసారి పనిష్మెంటు ఇస్తేగానీ దారికి రాదు--

ఈ రోజుల్లో భార్యభర్తలిద్దరూ సంపాదిస్తే గానీ అవసరాలు తీరవు. టి.వి., ఫ్రిజు, ఫ్యాను, స్వంత ఇల్లు, వీటిలో ఏది లేకపోయినా బతకడం కష్టంగా ఉంది-- విజయ్ సంపాదనలో అతని తల్లిదండ్రులకి మధ్య, మధ్య డబ్బు పంపించాలి-- అతని ఖర్చులు కూడా పోతే, నెలకి సరిపడా సరుకులకి మాత్రం అతని జీతం ఇస్తాడు.

కీర్తిని మంచి కాన్వెంటులో చేర్పించి చదివించాలి, ట్యూషన్లు, పుస్తకాలు, దాని బట్టలు, సరదాలు ఇవన్నీ, ఇవన్నీ ఇలా జరుగుబాటు అవుతాయి? తను ఉద్యోగం చేయకపోతే -- బజారుకి వెళితే నాకది కావాలి, ఇది కావాలి అంటూ గొడవ చేస్తుంది-- ఎలా వస్తాయి అమ్మ ఉద్యోగం చేయకపోతే? ఓ పక్క నిత్యావసర వస్తువుల ధరలు ఎలా పెరిగిపోతున్నాయి. కాస్టాఫ్ లివింగ్ నానాటికీ పెరిగిపోతోంది -- తప్పదు ఇదంతా అనివార్యం--

"ఆఫీసు అయిపోగానే ఇంటికి వచ్చెయ్ మమ్మీ, ఆఫీసు జీపుకోసం ఎదురు చూడద్దు ఆటోలో రావచ్చుగా, పదిరపాయలేగా మమ్మీ ఆటోకి అయ్యేది-- పోనీ కారు కొనుక్కో, కారులో అయితే ఎప్పుడంటే అప్పుడు రావచ్చుగా" కీర్తి రోజూ అనే మాటలు గుర్తొచ్చాయి -- ఏదో వాగుతుంటుంది -- పొరపాటున ఓసారి "జీపు బైటికెళ్లిందమ్మా, వచ్చిందాకా ఎదురు చూశాను -- అందుకే ఆలస్యం అయింది" అని చెప్పింది -- అందుకని ఆటోలో రావచ్చుగా, కారు కొనుక్కోవాలంటే మరి తను ఉద్యోగం చేయాలి అని తెలియదా? ఇంకెప్పుడు తెలుసుకుంటుంది!

అయినా ఈ రోజుల్లో ప్రతి ఇంట్లో పిల్లలు తల్లి, తండ్రి ఇల్లు చేరిందాకా వంటరిగానే ఉంటున్నారు. డూప్లికేటు కీ ఇచ్చి స్కూలు నుంచి రాగానే తనంతట తాను తాళం తీసుకుని లోపలికి రాగానే తిరిగి లాక్ చేసి ఇంట్లోనే ఉండమని చెప్పింది. "బైటికి వెళ్లమని ఒక్కసారి పర్మిషన్ ఇస్తే ఇంక చదువుకోకుండా ఆటలు, ఫ్రెండ్స్‌తో కాలక్షేపం చేయడం చేస్తుందని భయం. అయినా ఇంట్లో ఇన్ని సౌకర్యాలు ఉండగా "బైటికెందుకెళ్లాలి? కాస్సేపు ఆడుకుంటాను మమ్మీ అంటుంది. భయమేస్తోంది మమ్మీ అంటుంది. భయం ఏమిటి? వాచ్‌మెన్ ఇరవై నాలుగ్గంటలూ కాపలా ఉండే ఈ ఫ్లాట్స్‌లో భయం అనే ప్రశ్నే లేదు -- కీర్తిని ఈ అలవాటు నుంచి మార్చాలి --భయం అనడం, తోచట్లేదనడం బాగా అలవాటైపోయింది ఈ జనరేషన్ పిల్లలకి. ఇలా అయితే భవిష్యత్తులో ఇది 'బాగుపడినట్టే, ఆడపిల్లలు డైనమిక్‌గా తయారవాలంటే చిన్నప్పటి నుంచే అన్నిటికీ అలవాటు పడాలి -- కీర్తిని ఇలా పిరికిగా తయారవ్వనివ్వకూడదు -- ఈ రోజుల్లో ఒక్క పిల్ల చాలు -- దాన్నే ఎంతో పైకి తీసుకురావాలన్నది తన నిర్ణయం, అందుకే కీర్తి పుట్టిన వెంటనే ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ కూడా చేయించుకుంది -- ఈ ఒక్కతీ ఇలా తయారైతే ఎలా? నో! కీర్తిని సానబట్టాలి-- గట్టిగా నిశ్చయించుకుంది.

ఈ యాంత్రిక ప్రపంచంలో జీవితాలు కూడా యాంత్రికం కాక తప్పదు, అలవాటు పడాలి అంతే, -- వెంటనే కీర్తిని హాస్టల్లో చేర్పించాలి... ఇలా ఇంట్లో ఉంటే క్రమశిక్షణ సంగతి దేవుడెరుగు, పిచ్చి, పిచ్చి ఆలోచనలతో చదువు నిర్లక్ష్యం చేస్తుంది... జీవితంలో అతి ముఖ్యమైన చదువు నిర్లక్ష్యం చేస్తే మాత్రం దీనికి భవిష్యత్తు లేనట్టే.. రేపే వెళ్లి రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించాలి... చాలాసార్లు అనుకుంది ఈ మాట... ఈసారి ఎలాగైనా చేర్పించాలి.

పవిత్ర అక్కడి నుంచి కదిలి, చేతివాచీ తీసి డ్రెసింగ్ టేబుల్ మీద పెట్టి, బాత్‌రూములోకి వెళ్లింది. స్నానం చేసి, నైటీ వేసుకుని డైనింగ్ టేబులు దగ్గరకి నడిచింది-- ఏం తినాలనిపించలేదు. ఫ్రిజులోంచి మజ్జిగ తీసుకుని గ్లాసులో పోసుకుని తాగేసి, తిరిగి హాల్లోకి నడిచింది-- అన్ని గదుల్లో లైట్లార్పేసి బెడ్‌రూములోకి వచ్చి, కీర్తిని సరిగా పడుకోబెట్టి, చిందర, వందరగా పడిన పెన్ను, పెన్సిలు, పుస్తకాలు తీయబోతుండగా కనిపించింది-- నల్లగా, నిగనిగలాడే అట్టతో డైరీ.

పవిత్ర ఉలిక్కిపడింది-- ఎవరిదీ డైరీ? పేజీలు తిప్పింది కీర్తి చేతిరాతతో పేజీలు చాలా వరకు నిండిపోయి వున్నాయి

కీర్తి డైరీ రాస్తుందా? ఇంత చిన్న వయసులో ఇంతగా డైరీలో రాసుకోవాల్సిన సంగతులేమున్నాయబ్బా దీనికి? పవిత్ర డైరీ తిరగేసింది.

ఫిబ్రవరి 11 : మమ్మీ ఇవాళ చాలా లేటుగా వచ్చింది డాడీ వేరే ఊరు వెళ్లి నాలుగు నెలలైంది -- నాకు చాలా భయం వేసింది -- ఇంట్లో ఒంటరిగా వున్నాను మమ్మీ తలుపు వేసుకుని లోపలే కూర్చోమని చెప్పింది -- లోపల కూర్చున్నా నాకెందుకో భయం వేస్తోంది -- ఎవరితోనన్నా మాట్లాడాలని ఉంది, కానీ ఎవరితో మాట్లాడను? ఇవాళ క్లాసులో టీచరు చెప్పారు. డైరీ రాయడం మంచి అలవాటుట. డైరీ ఓ మంచి ఫ్రెండుట-- పోనీలే మమ్మీ, డాడీ ఆఫీసుకెళ్లి పోయాక నాతో మాట్లాడేవాళ్లు ఎవరూ ఉండరుగా, పైగా మమ్మీ ఏమో ఫ్రెండ్సుతో ఆడకుండా చదువుకోమని చెప్పింది అందుకే ఇప్పటి నుంచీ ఈ డైరీ నా బెస్ట్ ఫ్రెండు--డైరీ, డైరీ నాకు భయం వేస్తే తోడుంటావు కదా!

ఫిబ్రవరి 15 : మమ్మీ రోజూ లేటుగానే వస్తోంది. నాకు వంటరిగా ఉండాలంటే చాలా భయంగా వుంది. తలుపులు వేసుకుని లోపల కూర్చుంటే ఎలాగో ఉంది. నేను నాటిన గులాబీ ఇవాళ మొగ్గవేసింది. -- బాల్కనీలో దాన్ని చూస్తూ కూర్చున్నాను. కానీ ఎంతసేపని చూడాలి? ఒక్కటే మొక్క -- ఇంకా మొక్కలు నాటుదామంటే ఈ ఫ్లాటులో ప్లేసే లేదు -- హోంవర్కు చేయాలంటే అసలే మూడ్ రావడం లేదు ఒంటరిగా ఉంటే బాగా చదువుకోవచ్చు ఏ డిస్టర్బెన్స్ లేకుండా అని చెప్పింది మమ్మీ-- కానీ నాకెందుకో వంటరిగా ఉంటే చదువుకోవడానికి మూడే రావడం లేదు -- మమ్మీ త్వరగా రావా! ప్లీజు మమ్మీ కం సూన్-- కిటికీలోంచి ఎక్కడినుంచి వచ్చిందో పిల్లి వచ్చింది -- చదువుకుందామని పుస్తకం తెరిచాను. తీరా పిల్లి దూకడంతో భయం వేసి గట్టిగా అరిచాను-- నేనంత గట్టిగా అరిచినా పక్క ఫ్లాటు వాళ్లు వచ్చి ఏమైంది కీర్తీ భయపడ్డావా? మా ఇంట్లో కూర్చో మమ్మీ వచ్చిందాకా అనచ్చుగా, వినపడలేదా?

ఫిబ్రవరి 20 : ఇవాళ నా బర్త్‌డే. మమ్మీ నాకు ఉదయమే తలంటి పోసి, స్వీటు పెట్టింది. కొత్త డ్రెసు ఇచ్చింది -- సాయంత్రం త్వరగా వస్తాను. సినిమాకు వెడదాం అని చెప్పింది కానీ రాలేదు. తొమ్మిది అయింది ఇప్పుడు -- మమ్మీ ఇంకా రాలేదు నాకు ఏడుపొస్తోంది గట్టిగా ఏడిస్తే పక్క ఫ్లాటు వాళ్లు వింటారుగా, నన్ను షేమ్ అంటారామో! బలవంతంగా ఏడుపాపుకుంటే గొంతు నొప్పిగా అనిపిస్తోంది -- మమ్మీ ఇంక రాదు, ఇవాళ నా పుట్టిన రోజునాడు కూడా నేను ఒంటరిగానే వున్నాను. ఇంక పడుకుంటాను నిద్రపోతే ఈ బాధ ఉండదుగా. డాడీకి తీరిక దొరకలేదుట, ఫ్లవరు బొకే పంపించారు. బొకే చాలా బాగుంది, పూలు కూడా అందంగా తాజాగా వున్నాయి. కానీ డాడీ లేకుండా నాకు బొకే ఎందుకు? రోజీ, ప్రేమ బర్త్‌డేలకి కనీసం వాళ్ల మమ్మీ అన్నా ఉంది దగ్గర. ఆఫీసు నుంచి త్వరగా వచ్చి వాళ్ల చేత కేకు కోయించింది -- అందేంటో ఈ ఫ్లాట్సులో అందరమ్మలు జాబ్ చేస్తారు కానీ ఎవ్వరూ మమ్మీ అంత లేటుగా రారు. మరి మమ్మీ ఎందుకు లేటుగా వస్తుంది? అసలు డాడీకి, మమ్మీకి వాళ్ల ఆఫీసులే ఎక్కువా నా కన్నా? కానీ నాకు ఈ ప్రపంచంలో అందరికన్నా మమ్మీ, డాడియే ఎక్కువ... ఇలా అంటే మమ్మీకి కోపం వస్తుంది.. నీకు పిచ్చి, పిచ్చి ఆలోచనలు ఎక్కువవుతున్నాయి... హాస్టల్లో చేర్పిస్తాను అని తిడుతుంది.. బాబోయ్! హాస్టల్లో చేరితే హాస్టలు వాళ్లు పిల్లల్ని చాలా కష్టాలు పెడతారట. అన్నం కూడా సరిగా పెట్టరట. టీవీలో చూపిస్తుంటారు. న్యూస్ పేపర్లో కూడా రాశారు.. ఆ బాధలకన్నా ఇదే నయంగా... పైగా అక్కడైతే మమ్మీని చూడటానికి ఎప్పుడో ఒకసారి పంపిస్తారట.. ఇంట్లో ఉంటే మమ్మీ రాత్రికన్నా కనిపిస్తుంది...

పవిత్ర గబగబా డైరీ పేజీలు తిరగేసింది అన్ని పేజీల నిండా

మమ్మీ! నాకు వంటరిగా ఉండాలంటే భయంగా ఉంది, నాకు ఇక్కడ మాట్లాడడానికి ఫ్రెండ్సు ఎవరూ లేరు, నువ్వు త్వరగా రా, ప్లీజ్ త్వరగా రామమ్మీ!

మమ్మీ బైట ఎవరో దెబ్బలాడుకుంటున్నారు, కిటికీలోంచి చూస్తున్నాను, నాకు భయంగా ఉంది. మమ్మీ వచ్చేస్తే బాగుండు, దేవుడా, నాకు ఉద్యోగం చేసే మమ్మీ వద్దు, నాతో ఉండే మమ్మీ కావాలి, మమ్మీనాతో ఉండేలా చేయవా? ఇంట్లో ఎవరూ లేకపోతే నాకు బిస్కెట్ కూడా తినబుద్ధి కావడం లేదు-- మమ్మీ చేత్తో ఇస్తే తినచ్చు--

మమ్మీ నిన్ను వీడియో గేమ్ కావాలని, డ్రెస్ కావాలని అడిగాను కదా! నాకవేం వద్దు మమ్మీ నువ్వు త్వరగా ఇంటికొచ్చెయ్ అయామ్ మిస్సింగ్ యు మమ్మీ...

చేతిలో డైరీ విసిరేసింది పవిత్ర.. నీళ్లు

(మిగతా 23వ పేజీలో

విద్యుత్ సంస్కరణలపై అవగాహనకు, చర్చకు ఉపకరించే గ్రంథం

రాష్ట్రంలో ప్రారంభమైన విద్యుత్ సంస్కరణలపై ఒక అవగాహనకు రావడానికి, వాటిపై చర్చ జరపడానికి ఈ పుస్తకం దోహదపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంస్కరణల బండిపై ప్రయాణం ప్రారంభించి నాలుగేళ్ళు కావస్తున్న తరుణంలో వాటి పూర్వాపరాలు, పొరుగు రాష్ట్రం ఒరిస్సా అనుభవం, సంస్కరణల వివరాలు, ప్రపంచబ్యాంక్ ఒప్పందం, వాటి వల్ల కలిగే లాభనష్టాలు తదితర అన్ని అంశాలను రచయిత ఈ పుస్తకంలో వివరంగా చర్చించారు. రచయిత సీనియర్ పాత్రికేయుడు కావడం మూలంగా పుస్తకాన్ని సరళంగా, అందరికీ అర్థమయ్యే విధంగా రూపొందించగలిగారు.

1991లో దేశంలో ప్రారంభమైన ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా దేశవ్యాప్తంగా విద్యుత్ బోర్డులు నష్టాల్లో కూరుకుపోసాగాయి. డిమాండ్‌కు తగిన విధంగా విద్యుత్ ఉత్పాదన లేకపోవడం, నష్టాల నుండి బయటపడలేకపోవడం. కొత్త ప్రాజెక్టులు నిర్మించడానికి బోర్డుల వద్ద, ప్రభుత్వాల వద్ద నిధులు 'లేకపోవడం' ప్రైవేటు సంస్థల ప్రవేశానికి దారినిచ్చాయి. ప్రైవేటు సంస్థలకు మార్కెట్ చూపించాలి, విద్యుత్‌బోర్డుల పట్ల వాటికి నమ్మకం కుదరాలి. అందుకు బోర్డులను పునర్నిర్మించాలి. అందుకు ప్రభుత్వాలకు చాలా నిధులు అవసరం. కాబట్టి నిధుల కోసం ప్రపంచబ్యాంక్ వద్దకు వెళ్ళాయి. నిధులివ్వాలంటే ప్రపంచబ్యాంక్ పెట్టిన షరతులకు తలొంచాలి. వారు చెప్పినట్లుగా ఛార్జీలు పెంచాలి, అంతకన్నా ముందు బోర్డును మూడు ముక్కలుగా విభజించాలి, సరఫరా, పంపిణీ రంగాలను కూడా ప్రైవేటీకరించాలి. ఈ పరిణామాలన్నింటినీ కళ్ళకు కట్టినట్లుగా, చక్కగా అర్థమయ్యేవిధంగా వివరించారు. మనకంటే ముందుగానే సంస్కరణలు ప్రారంభించిన ఒరిస్సాలో ప్రైవేటు సంస్థలు ముఖ్యంగా అమెరికాకు చెందిన బహుళజాతి సంస్థ అమెరికా ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ 1999లో వచ్చిన పెనుతుపాన్ సందర్భంగా ఎంతగా వేధించిందీ వివరించారు. ప్రైవేటు సంస్థలకు లాభాలు తప్ప సామాజిక బాధ్యత ఉండదనేది రుజువుచేసుకున్న విషయం చక్కగా వివరించారు. సంస్కరణల వల్ల మొత్తం వినియోగం, తలసరి విద్యుత్ వినియోగం పెరగడం ప్రపంచవ్యాప్త అనుభవమని సంస్కరణ వాదుల వాదం. అయితే ఒరిస్సాలో సంస్కరణలతో ఛార్జీలు పెరిగి వినియోగం దారుణంగా పడిపోయింది. విద్యుత్ చౌర్యం తగ్గకపోగా పెరిగింది.



విద్యుత్ వలయం
సంస్కరణల విశ్లేషణ
రచన: కె.రామచంద్రమూర్తి, వెల:రు. 100/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

1994 వరకు లాభాలతో నడిచిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌బోర్డు ఆ తర్వాత ఎందుకు నష్టాల్లో కూరుకుపోయింది. దానికి ఎవరు బాధ్యులో, వారే ఎందుకు బాధ్యత వహించాలో చెప్పారు. ప్రైవేటు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, వాటిలో దాగున్న నిగూఢ రహస్యాలు, ప్రపంచబ్యాంక్ షరతులు, రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా నడుస్తున్నట్లు తెలియకుండా విద్యుత్‌ఛార్జీల నియంత్రణా కమిషన్ నడుచుకోవడం వంటి విషయాలు వివరించారు. విద్యుత్ సంస్కరణలు పూర్తిగా వ్యతిరేకించని రచయిత తన పరిధిలో విద్యుత్‌ను ప్రజలకు చేరువలోకి ఎలా తీసుకురావచ్చో వివరించారు. విద్యుత్ సంస్థల ఆస్తులను ప్రైవేటు కంపెనీలకు తెగనమ్మకుండా కేవలం నిర్వహణ వరకు మాత్రమే అప్పగించడం ద్వారా ఆస్తులను రక్షించుకోవడమే గాక సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని చెప్పారు. ప్రపంచబ్యాంక్ చెప్పిందే వేదంగా, వారే సర్వజ్ఞులుగా భావించే కొందరు నాయకులు, అధికారులు, మేధావులు కళ్ళు తెరవడానికి ఈ పుస్తకం దోహదపడవచ్చు. సంస్కరణల గురించి ఆమూలాగ్రం చర్చించిన రచయిత కె. రామచంద్రమూర్తి పుస్తకంలో ఒక లోపాన్ని మిగిల్చారు. విద్యుత్ సంస్కరణల గురించి రాష్ట్ర ప్రభుత్వంలో ఆలోచన ప్రారంభమైనప్పటినుండి వాటి గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేస్తూ, రాబోయే విపరిణామాలు, ఇతర దేశాల అనుభవాలు వివరిస్తూ విశేషకృషి సల్పిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)ను, వామపక్షాలను సముచితమైన రీతిలో ప్రస్తావించలేదు. రాజకీయ పార్టీలన్నీ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించాయని అర్థం వచ్చేలా ఆరోపించడం అంత సమంజసంగా అనిపించలేదు. గత ఏడాది విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో జరిగిన ఉద్యమం గురించి రచయిత ముందుమాటలో మాత్రమే పేర్కొనడం, పుస్తకంలో పెద్దగా పట్టించుకోలేదు.

- ఇ.వి.బాలాజి

స్వీకారం

అచ్చమైన తెలుగుదనం తొణికసలాడే ముచ్చటైన పలుకుబడి, విజాతీయ వాసనా సంస్కారణ ధోరణికి దూరమై స్వజాతీయతను సంతరకట్టుకున్న పాత్రలు, గోదావరి ప్రవాహంలా సాగిపోయే శిష్టవ్యావహారిక విశిష్ట శైలి శ్రీపాదవారి నవలల్లో మూర్తీభవిస్తాయి.

శ్రీపాదసుబ్రహ్మణ్య శాస్త్రిగారి నవలలు
వెల : రు. 125/-, **ప్రతులకు** : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఇందులోని వ్యాసాలన్నీ గడిచిన దశాబ్ద కాలంలోనే విజయ పరంపరలను సమీక్షిస్తూ సాగినవే. భిన్నభిన్న సందర్భాలలో రచించినవి, ఉపన్యసించినవి కావడం వల్ల కొన్ని అంశాలలో పునరుక్తి వుంది.

ఆగామి శతాబ్దానికి ఆహ్వానం
రచన : డా॥ సోమసుందర్ ఆవంత్స, వెల : రు. 60,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఈ కవితా సంపుటిలో 24 కవితలున్నాయి. అన్ని వేదనా భరితమైనవే కేవలం ఈ శీర్షికలను చూస్తే కవి హృదయం తెలుస్తుంది. ఈ శీర్షికల సమూహం సమగ్రంగా కవి ఆవేదన భావోద్రేకాలకు ప్రతిబింబం. ఇందులోని కవిత్వం సామాన్యుడిని సైతం కదలింపచేసేదిగా వుంది.

వెలుగుకోసం
రచన : ఖాజ ఉమర్, వెల : సాదాప్రతి: రు.20, గ్రంధాలయ ప్రతి : రు. 50, **ప్రతులకు** : ఖాజా ఉమర్, 16-5-27, ఫర్‌హత్‌నగర్, హైదరాబాద్-24; విశాలాంధ్ర బుక్‌హౌస్, హైదరాబాద్,

స్వయంకృతాపరాధం

అంపశయ్య నవీన్

"అమెరికాలో ఉన్న మా పిల్లలేమయి పోయారో ఏమిటో.. ఏ పీడకలలో కూడా ఊహించనంత భయంకర సంఘటన జరిగిపోయింది.. ఈ ప్రపంచం ఇక ఉండదండి.. మొత్తం పేకమేడలా కూలిపోతుంది... అగ్ని పర్వతానికి ఆహుతైపోయినట్టుగా ఆహుతైపోతుంది... కాలి బూడిదైపోతుంది... అమెరికాలాంటి అత్యంత శక్తివంతమైన దేశానికే ఇంత గతి పట్టిందంటే మన దేశంలాంటి దేశానికేగతి పడ్తుందో నేనూహించలేను. అమెరికాలాంటి పెద్దపులిని రెచ్చగొట్టాక అదూరుకుంటుందా?.. మొత్తం ప్రపంచాన్నంతా భస్మీపటలం చేసి వదుల్తుంది. నా అంచనా ప్రకారం మూడో ప్రపంచ యుద్ధం వచ్చి తీరుతుంది. ఈ ప్రపంచం మాడి మసై పోతుంది... తప్పదండి... తప్పదు.. ఘోరకలి... ఘోరకలి... అమెరికాలో వున్న మా పిల్లలెలా వున్నారో.. ఏమైపోయారో.. తల్చుకుంటే గుండెలు గుభేలుమంటున్నాయి!! అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

"ప్రపంచమంతా మాడి మసైపోతుందంటున్నారు కదా... అటువంటప్పుడు మీ పిల్లలకేమో అవుతుందని గుండెలు బాదుకోవడం దేనికి.. పోతే అందరమూ పోతాం..." అన్నాన్నేను.

"అందరం పోయేటప్పుడు పోతాంలెండి. కానీ ఈలోగా మనకు దగ్గరివాళ్ళు, మన వాళ్ళనుకున్న వాళ్ళూ ఎలా ఉన్నారో, ఏమైపోయారోనన్న బాధ తప్పదు గదా... ఇలాంటి దారుణమైన సంఘటనలు జరుగుతాయని "నోస్టర్ డామాస్" అనే ఫ్రెంచ్ జ్యోతిష్కుడెప్పుడో చెప్పాట్ట కదా... పర్వతాల పట్టణంలో... అంటే ఆకాశ హర్మ్యాలున్న న్యూయార్క్‌లోని రెండు టవర్స్ మీద దాడి జరుగుతుందని, అవి కాలి కూలి నశించిపోతాయని, ఆ తర్వాత మూడో ప్రపంచ యుద్ధమొస్తుందని "నోస్టర్ డామాస్" 17వ శతాబ్దంలోనే చెప్పేశాట్ట... చూశారా... శివాజ్ఞ లేనిదే చీమ కూడా కదలదని, అంతా ఇదివరకే ఇలా జరగాలని దేవుడు నిర్ణయించాడని నేను చెబితే మీరు నమ్మరు.. జ్యోతిష్యం బూటకపు సైన్సేనంటారు.." అన్నాడు పుల్లారావు.

"జ్యోతిష్యం బూటకపు సైన్స్ అనడంలో నాకెలాంటి సందేహం లేదు. యాదృచ్ఛికంగా ఒకటో రెండో నిజమైనంత మాత్రాన జ్యోతిష్యం సైన్సయిపోదు.. ఆ విషయమట్లా ఉండనీయండి... మీ పిల్లలు న్యూయార్క్‌లో ఉండరు కదా.. ఈ సంఘటన జరిగింది న్యూయార్క్‌లో కదా.. అదీ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు సంబంధించిన రెండు టవర్స్ కదా కూలిపోయాయి. మీరెందుకంత భయపడిపోతున్నారు..." అన్నాన్నేను.

"మా పెద్దవాడు అక్కడున్నప్పుడు వరల్ట్‌ట్రేడ్ సెంటర్‌కు వెళ్తుంటాడండి. నేను కూడా ఓసారి అమెరికాకు వెళ్లినప్పుడు డబ్ల్యు.టి.సి. బిల్డింగ్‌కు మా వాడితో వెళ్ళాను... ఏం బిల్డింగండి అది! భూలోక స్వర్గమంటే అదేననిపించింది... ఆ రెండు టవర్స్ ఒకదాని పక్కనొకటి రెండు మహా శిఖరాల్లా సగర్వంగా, అమెరికాలోని అశేషమైన సంపదకు సంకేతాల్లాగా నిల్చొని ఉంటాయి... ఆ రెండు టవర్స్‌లో యాభైవేల మంది పని చేస్తారట.. రోజూ ఓ లక్ష మంది విజిటర్స్ ఆ టవర్స్‌లోకి వచ్చి పోతుంటారట... అట్లాంటి అద్భుత టవర్స్ మీదకు అమెరికా విమానాలనే దూసుకుపోయేలా చెయ్యడం, అమాయకులైన ప్రయాణీకులున్న విమానాలతో వాటిని ఢీకొట్టి మహా ప్రళయాన్ని సృష్టించడం.. ఎంత దారుణం.. ఎంత దారుణం.. ఎన్ని వేల మంది చనిపోయారో.. ఎన్ని కంప్యూటర్లు ధ్వంసమైపోయాయో.. ఎన్ని ఎయిర్ కండిషనర్స్ నాశనమయ్యాయో.. ఎంత ఫర్నిచర్ కాలిపోయిందో.. అయ్యో! అమెరికా! నీకెంత గతి పట్టిందే! అత్యంత పటిష్టమైన రక్షణ వ్యవస్థను రూపొందించుకున్నారని, ప్రపంచంలో ఏ శక్తీ నన్నేమీ చెయ్యలేదని చెప్పుకున్న అమెరికా... ఓ అమెరికా... మై అమెరికా... మై హార్ట్‌బ్లీడ్స్

ఫర్ యూ..." అంటూ పుల్లారావు కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

"అమెరికా అంటే మీ కంత అభిమానమా?"

"నాకే కాదు.. మన ఇండియన్స్‌కు.. ముఖ్యంగా మన తెలుగు వాళ్ళకు అమెరికా అంటే అభిమానమే.. ఎందుకంటే మన పిల్లలందరూ అక్కడే వున్నారు. మన బెస్ట్‌బ్రెయిన్స్ అన్నీ అమెరికాలోనే వున్నాయి. అమెరికా నుండి మన పిల్లలు పంపిస్తున్న డాలర్లే మన పేదరికాన్ని పోగొడ్తున్నాయి.. మీరో విషయం గమనించారో లేదో.. అమెరికాను సామ్రాజ్యవాద దేశమని, ప్రపంచాన్నంతా తన గుప్పిట్లో పెట్టుకోవాలని కుట్ర పన్నుతున్న దేశమని తిట్టేవాళ్ళంతా వాళ్ళ పిల్లల్ని ఇక్కడ బాగా చదివించి అమెరికాకు పంపిస్తున్నారు.. వాళ్ళు పంపిస్తున్న డాలర్లతో బిల్డింగులు కడ్తున్నారు.. కార్లు కొంటున్నారు.. షేర్లు కొంటున్నారు.. అసలు అమెరికాకే మన వాళ్లు ఇంతమంది వెళ్ళకపోతే మనమంతా ఇంకా దరిద్రులంగానే ఉండేవాళ్ళం... అమెరికా మన పాలిటి కల్పతరువు.. మన పాలిటి భూతలస్వర్గం.. అమెరికాకు వెళ్ళిరావడమంటే స్వర్గానికెళ్ళొచ్చినట్లు... అక్కడే ఉండిపోవడమంటే స్వర్గంలో ఉండిపోవడమే.. అమెరికాలో కొంతకాలం ఉండొచ్చి ఇండియాకొస్తే ఎలా ఉంటుందో తెలుసా? ఏసీరూంలోంచొచ్చి పెనొంమీద పడ్డట్టుగా ఉంటుంది. అలాంటి అమెరికా మీద ఈ 'ఒసామా బిన్ లాడెన్'గాడు ఇంత పెద్ద ఎత్తున దాడి చేయిస్తాడా? వాడు పాతాళలోకంలో దాగున్నా సరే, అమెరికా వాడిని వదిలిపెట్టదు.."

"మీ కోసంగతి తెలుసా? ఈ 'ఒసామా బిన్ లాడెన్' అనేవాడు ఎవరి సృష్టో మీకు తెలుసా?" అన్నాన్నేను.

"ఎవరి సృష్టంటారు? ఇస్లాం మతోన్మాదుల సృష్టి... కాదంటారా?"

"బిన్ లాడెన్ అనే భూతాన్ని మీ అమెరికాయే సృష్టించింది. ఎనభైలలో అప్పటి సోవియట్ యూనియన్ ఆఫ్ఘనిస్తాన్‌కు అక్కడి ప్రభుత్వ కోరికపై తన సైన్యాన్ని పంపించింది. అప్పట్లో చాలాకాలం వరకు ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ సైన్యం ఉండిపోయి అప్పటి ఆఫ్ఘనిస్తాన్‌లోని సోవియట్ అనుకూల ప్రభుత్వానికి బాసటగా నిల్చింది. ఆఫ్ఘనిస్తాన్‌ను సోవియట్ యూనియన్ కబళించి వేసిందని, అక్కడో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని స్థాపించి, ఇస్లాం మతాన్ని కూకటివేళ్ళతో పెకలించి వేస్తోందని అమెరికా ప్రచారం చేసింది. అమెరికా గూఢచారి సంస్థ సి.ఐ.ఏ. ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌లో అధికారంలో వున్న తాలిబాన్లు అనే ఇస్లాం మతోన్మాదులను పెంచి పోషించింది. పాకిస్తాన్ ద్వారా తాలిబాన్లకు అత్యంత ఆధునికమైన ఆయుధాల్ని అందించింది. ఎలాగైనా సోవియట్ యూనియన్ మద్దతుతో కొనసాగుతున్న ప్రభుత్వాన్ని కూలదోయాలని కుట్ర పన్నింది. ఇందుకు బిన్ లాడెన్ లాంటి ఎందరో ఇస్లాం మతోన్మాదులను తన ప్రయోజనం కోసం వాడుకుంది. చివరకు 1986లో సోవియట్ యూనియన్‌లో అనేక సంస్కరణలకు కారకుడైన గోర్బచేవ్ అధికారంలోకొచ్చినప్పుడు సోవియట్ యూనియన్ ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్న తన సైన్యాన్ని ఉపసంహరించుకుంది. దాంతో తాలిబాన్లు అధికారంలోకొచ్చారు. బిన్ లాడెన్ తాలిబాన్లకు పెద్ద హీరో అయిపోయాడు... ఒకప్పుడు ఇందిరాగాంధీకి భింద్రన్‌వాలే లాగ, రాజీవ్‌గాంధీకి ఎల్.టి.టి.ఇ.లాగ ఇప్పుడు అమెరికాకు తాను పెంచిపోషించిన బిన్ లాడెన్ తననే కబళించి వేసే మహాభూతంగా మారిపోయాడు" అన్నాన్నేను. ☆



మురికివాడల నుంచి సైబర్ స్పేస్‌కు...

దేవప్రియ ఘోష్

అది ముంబాయి మహానగరం. అది ఆగస్టు నెల. సమయం ఉదయం 7.30 గంటలు. అనేక సంవత్సరాలుగా క్రమం తప్పకుండా చేస్తున్నట్లుగానే ఆ రోజు కూడా భగవాన్ పి.పవార్, ఆయన భార్య ఉష బాందవ్‌లోని చాల్లాలో వున్న తమ ఒక గది యింటి నుండి బస్సు అందుకునేందుకు హడావిడిగా బయలుదేరారు. వారా బస్‌లో గంటన్నర ప్రయాణం చేసి పోవైలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వద్ద దిగారు.

కొందరు విద్యార్థులు ఆ సంస్థలోకి గబగబా వెళ్తున్నారు. వారితో పాటు ఈ దంపతులు కూడా చక్కగా నిర్వహిస్తున్న ఐ.ఐ.టి. ఆవరణలోకి ప్రవేశించారు. తన పోషణలో, తన చేతుల మీదుగా పెరిగిన అందమైన తోటను చూసుకొని భగవాన్ తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఆయన ఎంతోకాలంగా అక్కడ తోటమాలిగా పని చేస్తున్నారు. 19 సంవత్సరాలుగా ఆయన పడిన శ్రమకు ప్రతిరూపంగా ఆ అందమైన తోట అక్కడ వుంది. తొలుత అతడక్కడ రోజుకు రు.3.50 కూలిపై రోజుకూలిగా చేరారు. ఐదేళ్ళ క్రితమే ఆయన ఉద్యోగం పర్మినెంట్ అయింది. కుటుంబ ఆదాయాన్ని మరికొంత పెంచుకొనేందుకు వీలుగా ఐ.ఐ.టి. క్యాంపస్‌లో వుండే ప్రొఫెసర్ల యిళ్ళలో ఉష పని చేసేవారు.

గత రెండు మాసాల నుంచి సంభవించిన సంఘటనలు ఆ దంపతులను ఆనంద డోలికల్లో ఓలలాడిస్తున్నాయి. వీరి పెద్ద కుమారుడు సిద్ధార్థ గత జులై 11న ఐ.ఐ.టి.లో ఎలక్ట్రికల్ యింజనీర్‌గా ఉత్తీర్ణుడయ్యాడు. అతడు డిగ్రీ పొందడానికి ముందే టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ అతనిని అసిస్టెంట్ సిస్టమ్స్ ఇంజనీర్‌గా నియమించింది. ప్రస్తుతం అతడు రెండు నెలల ట్రెనింగ్ ప్రోగ్రామ్ నిమిత్తం తిరువనంతపురంలో వున్నారు.

ముంబాయి మురికి వాడల నుంచి సైబర్ స్పేస్‌కు ఎదిగిన తమ కొడుకును చూసుకుని ఆ దంపతులెంతో గర్వపడుతున్నారు. సిద్ధార్థ ఆ స్థితికి ఎదగడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది. వారి నలుగురు పిల్లల్లో పెద్దవాడైన సిద్ధార్థ చాలా తెలివిగలవాడు. అతడు తల్లిదండ్రులు తనపై వుంచిన విశ్వాసాన్ని సాకారం చేశాడు. పేదవారెవ్వరూ ఊహించలేనంత ఉన్నత శిఖరాలకు ఎదిగి తన శక్తిని చాటాడు. "మేము అనుభవిస్తున్న దాస్యాన్ని మా బిడ్డలు అనుభవించరాదనుకున్నాము" అని ఐదవ తరగతిలోనే స్కూలు మానేసిన ఉష చెప్పారు. "మేము ఎంత తక్కువ ఆదాయంతో జీవిస్తున్నామో మా పిల్లలకు తెలుసు. మాకు ఎలాంటి విలాసాలు అందుబాటులో వుండవని కూడా వారికి తెలుసు. ఆ విషయాన్నే మా పిల్లలందరూ అర్థం చేసుకొన్నారు" అని ఆమె అన్నారు.

ఆర్థిక ఇబ్బందులు వుంటాయనేది వారికి తెలుసు. తల్లిదండ్రుల నుండి తమ చదువుకు సంబంధించి ఎలాంటి సహాయం అందదని కూడా వారికి తెలుసు. అయినప్పటికీ డబ్బు, ప్రోత్సాహం లేకపోవడం అనేవి వారికేమీ అడ్డంకులుగా నిలవలేదు. "చదువు విషయంలో మా పిల్లలకు మేము ఏ మాత్రం సహాయపడజాలము. అంతచదువు మాకు లేదు కదా!'' అంటున్నారు.''

10వ తరగతి అనంతరం పని పాటలు చేసుకోవడం ప్రారంభించిన భగవాన్. "అయితే మా పేదరికం వారి చదువుకు ఏనాడూ అడ్డంకి కాకుండా మా శాయశక్తులా ప్రయత్నించాము."

పోవై ఐ.ఐ.టి. క్యాంపస్‌లోనే వున్న కేంద్రీయ విద్యాలయంలో సిద్ధార్థ చదువుతున్నప్పుడు అతనికి వచ్చిన సందేహాలన్నింటినీ ఒక కాగితంపై రాయించేవాడు. వాటిని తీసుకెళ్ళి ఐ.ఐ.టి. విద్యార్థులకు చూపి సిద్ధార్థ అనుమానాలను



నివృత్తి చేసేవాడు. సిద్ధార్థ 6వ తరగతిలో వున్నప్పుడు అజిత్ గునేకర్ అనే పి. హెచ్.డి. విద్యార్థి ఉచితంగా ట్యూషన్ చెప్పాడు. అతని గదిలో ఉష పని చేస్తూ వుండేవారు.

"నాకు లెక్కలు లేదా భౌతిక శాస్త్రంలో ఎప్పుడు అనుమానాలొచ్చినా నేను వెంటనే ఆయన గదికి వెళ్ళేవాడినని" సిద్ధార్థ గుర్తు చేసుకొన్నాడు. "ఆయన ఒక ఉత్ప్రేరకంగా పనిచేసి నా జీవితాన్నే పూర్తిగా మార్చేశారు." ఆనాటి నుంచే తాను ఐ.ఐ.టి.లో చదివి ఇంజనీర్ కావాలనే పట్టుదల సిద్ధార్థలో పెరగసాగింది. అతడు 12వ తరగతిలో 92.6 శాతం మార్కులు సంపాదించాడు. తరువాత జాయింట్ ఎంట్రెన్స్ పరీక్ష (జె.ఇ.ఇ.) కోసం ఒక కోచింగ్ సెంటర్‌లో చేరి కరస్పాండెన్స్ కోర్సు ద్వారా శిక్షణ పొందాడు. దాని కోసం భగవాన్ రు.3000 ఖర్చు పెట్టాల్సి వచ్చింది. "అంత పెద్ద మొత్తం చెల్లించడమంటే నా తండ్రికి ఎంత కష్టమో నాకు తెలుసు" అని సిద్ధార్థ అన్నాడు. "అయినప్పటికీ ఆయన ఆ మొత్తం కట్టారు. నా కలలను భగ్నం చేయడం ఆయనకు యిష్టం లేనందునే ఎంతో కష్టపడి ఆ మొత్తం చెల్లించారు." కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ ఎ.కె. ఘోసల్ అప్పుడే ఉచితంగా శిక్షణనిచ్చేందుకు ముందుకొచ్చారు.

ఒక తోటమాలి కుమారుడైన సిద్ధార్థ ఎట్టకేలకు 1997లో జె.ఇ.ఇ. అఖిల భారత స్థాయిలో రిజర్వ్‌డ్ కేటగిరీలో 42వ స్థానంలో నిలిచాడు. అదే ముంబాయ్ జోన్‌లో అయితే 8వ స్థానంలో నిలిచాడు. ఐ.ఐ.టి. క్యాంపస్‌లో తిరుగుతున్న విద్యార్థులను చూసి తాను కూడా అలా తిరగాలన్న సిద్ధార్థ కలలు చివరకు నిజమై నిలిచాయి. "తదుపరి నాలుగు సంవత్సరాలు నా జీవితంలో ఎంతో అందమైనవని" సిద్ధార్థ అంటున్నాడు. తొలుత తాను ఎంతో కష్టపడాల్సి వచ్చిందని అతడంటున్నాడు.

అతడెంతో "నిజాయితీపరుడైన విద్యార్థి" అని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ విక్రమ్ మనోహర్ గాద్రే గుర్తు చేసుకున్నారు. "అతడు క్లాసులో ప్రథముడిగా వుండేవాడు కాదు. కానీ అతడు పెరిగివచ్చిన వాతావరణం, అతడు పడిన కష్టాలను దృష్టిలో పెట్టుకుంటే చాలా బాగా చదివినట్లే లెక్క" అని ఆయన అన్నారు. "అతనికి పాఠాలు చెప్పినందుకు నేనెంతో గర్విస్తున్నాను."

ఆర్థికంగా చూసుకొంటే మొదటి రెండు సంవత్సరాలు భగవాన్, ఉష ఎంతో బాధపడ్డారు. సిద్ధార్థ హాస్టల్‌లో వుండి చదవాలనే పట్టుదలతో వారున్నారు. అతనికి స్టడీ స్కాలర్‌షిప్ వున్నప్పటికీ, హాస్టల్ ఫీజు నుంచి మినహాయింపు వున్నప్పటికీ మెస్ ఛార్జీలు చెల్లించాల్సి వచ్చేది. మూడో సంవత్సరం నుంచి సిద్ధార్థకు మెస్ ఛార్జీలలో కూడా మినహాయింపు లభించింది.

అతడి కుటుంబ స్థితిగతులకు సంబంధించి ఎప్పుడైనా అవమానాలను ఎదుర్కొన్నాడా? "ఎవరైనా తమ తల్లిదండ్రుల వృత్తులకు సంబంధించి ఎందుకు అవమాన పడాలి?" అని సిద్ధార్థ అంటున్నాడు. "నాతండ్రి తోటమాలి అని, నా తల్లి ఇళ్లలో పని చేస్తుందని నా స్నేహితులకు తెలుసు. అయితే ఆ కారణంగా నేను కించపడాల్సిన పరిస్థితిని వారెన్నడూ కల్పించలేదు. నిజంగా చెప్పాలంటే విద్యార్థి దశలో మన కుటుంబ స్థితిగతులు పరిగణనలోకి రావని" అతని అభిప్రాయం.

సిద్ధార్థ తాను సాధించిన దానితో తృప్తిపడి తన కృషిని ఆపబోడన్న విశ్వాసంతో అతని తల్లిదండ్రులున్నారు. "అతడు జీవితంలో యింకా ముందుకు పోవాలి" అని భగవాన్ అన్నారు. అతని చిన్న కుమారులిద్దరు కూడా చదువుతున్నారు. ఒకరు డిగ్రీ చదువుతుండగా, అందరికంటే చిన్నవాడు కేంద్రీయ విద్యాలయంలో 12వ తరగతి చదువుతున్నాడు. భగవాన్ కుమార్తె లత 12వ తరగతి ఫెయిల్ అయి చదువు మానేసింది. ప్రస్తుతం బాండుప్‌లోని ఒక ప్రైవేట్ నర్సింగ్‌హోంలో నర్సింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది.

ఈ ఐ.ఐ.టి. డిగ్రీ హోల్డర్ భవిష్యత్‌లో

ఏమి కావాలనుకుంటున్నాడు? "నేను పరిశ్రమలో నిలదొక్కుకోవాలి. నా పనిలో నేను యింకా విజయవంతం కావాలి" అని సిద్ధార్థ దృఢంగా జవాబిచ్చాడు. ముంబాయిలోని మంచి ప్రదేశంలో తన తల్లిదండ్రులకు ఒక చక్కటి యిల్లు ఏర్పాటు చేయాలని అన్నాడు. బహుశా అప్పుడు భగవాన్, ఉష రోజూ పోవైకి చేసే బస్ ప్రయాణానికి గుడ్‌బై చెబుతారేమో!

☆

మిస్సింగ్ యూ

(19వ పేజీ తరువాయి)

నిండిన కళ్లకి నిద్రపోతున్న కీర్తి మసక మసగ్గా కనిపించింది. ప్రేమానురాగాల తోటి, రకరకాల కోరికలతోటి, ఆశల తోటి నిండి ఉండాల్సిన కీర్తి లేత గుండెల్లో ఎంత ఆవేదన! ఎంత ఒంటరితనం! ఎంత ఫ్రస్ట్రేషన్! ఎందుకిలా జరిగింది? పాలపుంతలా ఉండాల్సిన తన కీర్తి మనసు, ఇంత వేదనామయంగా ఎందుకు మారింది? కాంతులీనుతూ, సంతోషం చిందులేయాల్సిన. ఈ అందమైన కళ్లల్లో కన్నీళ్లా? దీనికంతటికీ కారణం ఎవరు? తనేనా?

ఎలా, ఎలా తనెలా కారణం! తను ఉద్యోగస్తురాలు. బాధ్యత గల ఆఫీసరు. అటు విధి నిర్వహణ, ఇటు కర్తవ్య నిర్వహణ-- ఎలా బ్యాలెన్సు చేసుకోగలదు? ఉద్యోగం చేయకపోతే గడవదా? లేదు, ఎలా గడుస్తుంది? - పోటీ ప్రపంచంలో తట్టుకొని నిలబడగల సామర్థ్యం ఎలా వస్తుంది!

మరి-- మరి ఇదిలాగే సాగితే కీర్తి సంగతేంటీ? ఈమె భవిష్యత్తేంటి? అమ్మ ప్రేమకోసం, అమ్మ సాంగత్యం కోసం పరితపించే ఈ చిన్నారి మానసిక పరిస్థితి ఏంటి? ఏంటి ఈ సమస్యకి పరిష్కారం? తనేం చేయగలదు! ఎలా పరిష్కరించగలదీ సమస్యని!

అప్పటిదాకా కీర్తిమీద వచ్చిన కోపం నెమ్మదిగా కరిగిపోయి, ఆ స్థానంలో ఆ పిల్ల పట్ల జాలి, ఆ చిన్నారి మనసులో కలుగుతున్న అలజడి పట్ల ఆందోళన మొదలైంది పవిత్ర మనసులో. నిజమే! ఈ ఫ్లాట్స్‌లో పక్క ఇంట్లో ఏం జరిగినా ప్రత్యేకంగా వెళ్లి పిలిస్తే గానీ పట్టించుకోరు-- కీర్తి కోసమే సెక్యూరిటీ ఉంటుం దని ఫ్లాట్ తీసుకున్నారు తను, విజయ్ ఆలోచించి-

ఎనిమిదేళ్లు కూడా నిండని చిన్నారి కీర్తి మనసులో ఇప్పటి నుంచే ఇంత ఆవేదన ఉంటే పెరుగుతున్న కొద్దీ ఈ భావాలు కూడా పెరుగుతాయి-- జీవితంలో విలువైనదేదో కోల్పోయానన్న అసంతృప్తితో కీర్తి ఏదన్నా అసాధారణ మనస్తత్వంతో తయారవుతుందేమో! ఈ రోజుల్లో పిల్లలు చిత్రమైన మనస్తత్వాలతో తయారవుతున్నారని, దానిక్కారణం వాళ్లకి చిన్న వయసులోనే విపరీతమైన మానసిక ఒత్తిడి అని సైకాలజీ ప్రొఫెసర్ ఒకాయన చెప్పడం విన్నది-- ఆ రోజు చిన్న పిల్లలకి మానసిక ఒత్తిడేంటి? ఈయనకి మతిపోయిందా? అనుకుని తేలిగ్గా తీసిపడేసింది తను - ఆయన చెప్పింది నిజమేనా? కీర్తి కూడా అలాగే తయారవుతోందా? నో! నో! నిలువెల్లా వణికిపోతూ అంతులేని సంఘర్షణతో కీర్తి మీద ఆరాటంగా, ఆప్యాయంగా చేయి వేసి దగ్గరగా పొదువుకుంది పవిత్ర. హాస్టల్లో చేర్పించాలనుకున్నా, చేర్పించను.. నిన్న అమ్మ ప్రేమకు దూరం చేయను.. నా మాట నమ్ము... కష్టమైనా, ఏమైనా భరిస్తాను... నీ కోసం కాకపోతే ఎందుకు నేను కష్టపడేది.. ధృడమైన నిశ్చయంతో కళ్లు మూసుకున్న పవిత్ర ప్రశాంతంగా నిద్రపోయింది.

☆

ఘంటాపథం

కొండబాబు

"అమెరికా టవర్స్‌పై దాడి చేసింది బిన్ లాడెనేనని ఎలా చెప్పగలవు?

"చేశాడు కాబట్టి చెప్పగలను" చెప్పాడు గంగాధర్.

"ఇలాంటి మొండి వాదనలొద్దు.. చెప్పగలిగితే సరిగ్గా చెప్పేదువ్.." కోపంగా అన్నాడు వెంకటేష్.

నవ్వాడు గంగాధర్ "అరె.. సరదాకి అన్నాను లేవోయ్.. బిన్‌లాడెనే చేశాడని నేను మాత్రం ఎలా చెప్పగలను? బుష్ అంటున్నాడు కాబట్టి..సి.ఎన్.ఎన్. అంటున్నది కాబట్టి...మా ఇంటికి వచ్చే బహుపెద్ద పేపరు రాస్తున్నది కాబట్టి...నేనూ అనగలుగుతున్నాను" గంగాధర్ సుదీర్ఘంగా చెప్పాడు.

"అదే సరైంది కాదంటున్నాను. ఎవరో చెబితే నమ్మేయడమేనా? మనకంటూ సొంత విశ్లేషణ అవసరం లేదా?" మిత్రుడిపై విసుగు ప్రదర్శించాడు వెంకటేష్.

"సరే, దాడి బిన్‌లాడెన్ చేయలేదని ఎలా చెప్పగలుగుతున్నావో చెప్పు".

"బిన్‌లాడెనే చేశాడనో, చేయలేదనో నేను చెప్పడంలేదు. ఈ సాకు చూపి అమెరికా అమాయక ఆఫ్ఘన్ ప్రజలపై దాడి చేయాలనుకోవడం దారుణమంటున్నాను. ఒక్క విషయం మాత్రం ఘంటాపథంగా చెప్పగలను" అన్నాడు.

"నువ్వంత ఘంటాపథంగా చెపితే కాదంటానా? అదేమిటో చెప్పు".

"అమెరికా అంతిమ లక్ష్యం తన పెత్తందారీ తనాన్ని ప్రదర్శించుకోవడం, యుద్ధం పేర అనేక దేశాల్ని రంగంలోకి దించి తన గిడ్డంగుల్లో పేరుకుపోయిన ఆయుధాల్ని అమ్ముకోవడమే..!"

"అదే ఈ విషయం నీకెంత తెలుసో కనుక్కుందామనే నిన్ను రెట్టించాను" గంగాధర్ చిద్విలాసంగా నవ్వుతూ చెప్పాడు.

వెంకటేష్ మిత్రుడి వైపు చిరుకోపంగా చూశాడు.

☆ ☆ ☆ ☆

వెంకటేష్ ఘంటాపథంగా చెప్పిన విషయాన్నే నేడు అనేక పత్రికలు మరింత సోదాహరణంగా రాస్తున్నాయి. మరికొన్ని కొత్త విషయాలనూ వివరిస్తున్నాయి.

ఇప్పుడు ఈ విషయం కాదు మనకు చర్చనీయాంశం. 'ఘంటాపథం' అన్న పదం మాత్రమే.

చాలామంది 'బల్లగుద్ది మరీ చెపుతాను' అంటుంటారు. వాస్తవంగా సినిమాల్లోని లాయర్లూ, జడ్జీలను తప్ప ఎవరూ బల్లగుద్ది చెప్పడం చూసి ఉండరు. మాట్లాడేప్పుడు మాత్రం ఈ పదాన్ని అలవోకగా వాడేస్తుంటారు. మరికొందరు 'కుండబద్దలుకొట్టినట్లు చెప్పాడు' అంటుంటారు. ఇక్కడా అంతే. కుండ బద్దలు కొట్టటమేమీ ఉండదు. కాని అలా అంటారు.

అలాంటిదే 'ఘంటాపథ' మూనూ. ఎదుటి వ్యక్తి మనం చెప్పేది నమ్మకపోతే 'ఇది నిజమని నొక్కి మరీ చెప్పటం' కోసం ఈ పదం వాడతాము. తను చేప్పేదే వాస్తవమని సవాల్ చేయడానికీ వాడతారు. మరి ఈ పదం పుట్టు పూర్వోత్తరాలేమిటి? ఏ సంతతి నుంచి వచ్చింది? అనేది మన ముందున్న అంశం.

మనం రాతకు వాడే పెన్నును, తెలుగులో 'కలం' అంటాము. ఈ కలాలు కాగితంపై రాస్తాయి. కాగితం లేక పూర్వం తాటాకులపై రాసేవాళ్ళు. తాటాకులపై ఈ కలాలతో రాయడం సాధ్యం కాదు. ఆనాడు తాటాకులపై రాయడానికి ఉపయోగించిన కలాన్ని 'గంటము' అనేవారు. గంటముతో రాసి... అంటే రాతపూర్వకంగా పూర్తి నమ్మకంతో చెప్పడాన్ని 'గంటాపదమ'నుకోవడం ఉంది. కాని దానికంటే, ఆధారపూరితమైన మరొక చర్చ ఉంది.

'ఘంటాపథ'మంటే రాజ మార్గము. అంటే రాజభవనానికి వెళ్ళే మార్గాన్ని 'ఘంటాపథం' అనంటారు. ఇది సంస్కృత పదం. రాజమార్గంలో సాధారణంగా మంత్రులు, ఆచార్యులు, విద్యాధికులు, ఉన్నతోద్యోగులు నడిచేవారు. అలాంటి రాచమార్గంలో ఎవరైనా ఉబుసుపోని కబుర్లు, అవాస్తవాలు మాట్లాడుకోవటానికి జంకేవారు. ఏ మాట అంటే ఏ రాజభటుడు అనుమానించి అరెస్ట్ చేస్తాడోనని! దీనిని బట్టి 'ఘంటాపథం'గా చెపుతానని ఎవరైనా అంటే, 'నిజం కాబట్టి రాచమార్గంలోనైనా చెపుతాను... నాకేం భయంలేదు! అని అర్థమన్నమాట.

'ఘంటాపథము'న.. 'ఘంటాపథాన'.. 'ఘంటాపథంగా'.. మారుతూ వచ్చింది. ఈ పదం ఇలాగే వచ్చి వుంటుందని 'ఘంటాపథం'గా చెప్పడానికి ఇబ్బందేమో! ☆

పాఠక స్పందన

పంచ సూత్రాలు ఆచరణ యోగ్యాలు

30-9-2001 ఆదివారం అనుబంధంలోని ఆరోగ్యం శీర్షికలో గుండె భద్రతకు సంబంధించి డా॥ బి.రమేష్ బాబు పంచసూత్రాలలో మాకు తెలియని ఎన్నో విషయాలు వివరించాయి. అవినీతి కేసుల్లో శిక్ష పడిన జయలలిత తమిళనాడు ముఖ్యమంత్రిగా కొనసాగడం తగదని సుప్రీంకోర్టు స్పష్టంగా ప్రకటించిన నేపథ్యంలో అందించిన కవర్ స్టోరీ, 'కోర్టు తీర్పులు-రాజకీయ మార్పులు' చాలా బాగుంది.

- బట్టా రామకృష్ణ, సౌత్ మోపూరు, నెల్లూరు జిల్లా

భ్రమల్లో జీవిస్తున్న యువత

గత నెల 23వ తేదీ ఆదివారం అనుబంధంలో సామాజిక స్పృహ కోల్పోతున్న యువత గురించి చక్కగా వివరించారు. నేటి యువత అనేక ప్రలోభాలకు లోనై భ్రమల్లో జీవిస్తున్నారు. కొందరు స్వార్థంతో తమ దేశం పట్ల బాధ్యతా రహితంగా వుంటున్నారు. దురలవాట్లకు గురవుతున్నారు. నేటి యువత దేశం, మానవాళి అభివృద్ధి గురించి ఆలోచించాలి. భవిష్యత్ ఆశాకిరణాలు కావాలి.

- పి.శేషగిరిరావు, జంగారెడ్డిగూడెం, పశ్చిమ గోదావరిజిల్లా

సోమరితనం మనిషికి చేటు

సెప్టెంబర్ 23వ తేదీ ఆదివారం అనుబంధంలో బాలకథ శీర్షికలో ప్రచురించిన 'సోమరితనం' కథ మమ్మల్ని ఎంతో ఆనందపరిచింది. అలాగే ఆరోగ్యం శీర్షికలో 'సాంప్రదాయ అలవాట్లలోని కంటి చికిత్సా దోషాల' గురించి డాక్టర్ సుబ్బారావు ఎన్నో మంచి విషయాలు తెలియజేశారు.

- డాక్టర్ ఎస్.సి.రావు, ఎస్.శ్రీదేవి,
మల్లంపేట, విజయనగరం

జోక్స్ కావాలి...

ఆదివారం అనుబంధంలో జోక్స్ కూడా ప్రచురిస్తే బాగుంటుంది. గత నెల 23వ తేదీ ప్రచురించిన కథ 'బిచ్చగాళ్ళ ఊరేగింపు, బాగుంది. ఆరోగ్యంలో కంటి చికిత్సా దోషాల గురించి చక్కగా వివరించారు. 'ప్రోగ్రెస్ రిపోర్ట్' కవిత చాలా బాగుంది.

- పి.ఎస్.ఎస్.కిరణ్, రామచంద్రాపురం, తూ.గో.జిల్లా

With best Compliments from :

చాంద్ సినిమా థియేటర్
మైదుకూరు రోడ్డు, ప్రొద్దుటూరు

అన్వర్ సినిమా థియేటర్
మైదుకూరు రోడ్డు, ప్రొద్దుటూరు

బి.వి.ఎస్. సినిమా థియేటర్
శివాలయం వీధి, ప్రొద్దుటూరు

సుధా సినిమా థియేటర్
శివాలయం వీధి, ప్రొద్దుటూరు

విజయకుమార్ సినిమా థియేటర్
టి.బి. రోడ్డు, ప్రొద్దుటూరు

వెంకటేశ్వర సినిమా థియేటర్
గాంధీరోడ్డు, ప్రొద్దుటూరు

బాలాజీ సినిమా థియేటర్
మున్సిపల్ పార్కు వద్ద, ప్రొద్దుటూరు

భారత్ సినిమా థియేటర్
ఎర్రగుంట్లరోడ్డు, ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు సినీ ఎగ్జిబిటర్స్
అసోసియేషన్, ప్రొద్దుటూరు, కడప జిల్లా.

దైవజనుడా! మీ రాక మా పట్టణానికి దీవెన

మిలీనియం

శాంతి మహోత్సవాలు

3 మహిమ కరమైన రాత్రులు

అందరూ ఆహ్వానితులే

2001 అక్టోబర్ 19,20,21

A.C. స్టేడియం, **నెల్లూరు**

(శుక్ర, శని, ఆది) ప్రతిరోజు సా॥ 6.గం॥లకు మీ క్షేమం కోసం,
రోగుల స్వస్థత కోసం ప్రతిరాత్రి ప్రార్థిస్తారు.

1000 మంది క్వయర్‌తో ప్రత్యేక సువార్త సంగీతం

మహోత్సవ ఆహ్వాన కమిటి - నెల్లూరు

GUM OFFICE : B.C. హాస్పిటల్ కాంపౌండ్, రైల్వే ఫీడర్స్ రోడ్, నెల్లూరు, ఫోన్ : 306208.

నేషనల్ డైరక్టర్ : రెవ. డా॥ కె. డేవిడ్‌రాజు   కన్వీనర్ : రెవ. కె. యెషయాబాబు



డా॥ కె. ఎ. పాల్ గారు

ఒక అందమైన సకుటుంబ వస్త్రలోకం



బొమ్మన

రాజ్‌కుమార్

లేడీస్ అండ్ జెంట్స్ క్లాత్ మర్చంట్స్

మెయిన్ రోడ్, రాజమండ్రి. ఫోన్ : 461129, 463988.

Mohan